మాస్టర్ ప్లాన్‌కు ససేమిరా..

- రాజధాని 17 గ్రామ సభల్లోనూ చేతులెత్తి వ్యతిరేకత
- బోరుపాలెం సభలో అనుకూలంగా ఒకరు

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ


Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 102 | విజయవాడ, ఆదివారం 13 నవంబర్ 2022 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 13 November 2022 | Rs

కప్ నీదా.. నాదా..!

- పాకిస్తాన్ X ఇంగ్లండ్ అమీ తుమీ
- నేడు టి20 ప్రపంచకప్ ఫైనల్



లోపలి పేజీలో..

విశాఖలో బహుళ రవాణా వ్యవస్థ

బహిరంగ సభలో ప్రధాని మోడీ • రాష్ట్ర సమస్యల విస్మరణ



విశాఖ సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ, చిత్రంలో విశ్వభూషణ్, జగన్మోహన్‌రెడ్డి, అశ్విని వైష్ణవ్

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

సమ్మిళిత అభివృద్ధిలో భాగంగా లాజిస్టిక్ మల్టీ మోడల్ కనెక్టివిటీ (బహుళ రవాణా వ్యవస్థల అనుసంధానం)కి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. ఆంధ్రా యూనివర్శిటీ మైదానంలో శనివారం జరిగిన బహిరంగ సభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. అంతకుముందు సభా వేదిక నుంచే రిమోట్‌తో రూ.10,742 కోట్లతో ఏడు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన హిందీలో కొనసాగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖపట్నం నగరం కూడా బహుళ రవాణా వ్యవస్థలతో అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డు,రైలు, పోర్టు మార్గాలను ప్రస్తావించారు. వాటి అభివృద్ధి, విస్తరణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. అయితే, ప్రధాని ప్రసంగంలో రాష్ట్రానికి సంబంధించిన కీలకసమస్యలను పూర్తిగా విస్మరించారు. విశాఖ ఉక్కు పరిరక్షణతో పాటు, ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వంటి అంశాలు వేటికీ ప్రధాని ప్రసంగంలో స్థానం లభించలేదు. ప్రధాని పర్యటన సాగిన శుక్ర, శనివారాల్లో కూడా ఉక్కు కార్మికులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళనలు కొనసాగించారు. పోలీసుల అరెస్ట్‌ల పరంపర కొనసాగుతున్నప్పటికీ శనివారం నాడు కూడా ఉక్కు ఫ్యాక్టరీ మెయిన్‌గేటు దగ్గర కార్మికులు నిరసన తెలిపారు. ఓడరేవుగా విశాఖ ప్రాశస్త్యాన్ని వివరించిన మోడీ అదే సమయంలో ఆ నగరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన విశాఖ ఉక్కు పరిశ్రమ పేరును కనీసం ప్రస్తావించకపోవడం చర్చనీయాంశంగా మారింది. విశాఖ ఓడరేవు చారిత్రాత్మకమైనదని, ఇక్కడ నుండి రోమ్ వరకు వ్యాపారం జరిగేదని, ఇప్పుడు కూడా విశాఖపట్నం దేశంలో ప్రముఖ వ్యాపార కేంద్రంగా ఉందని మోడీ అన్నారు. విశాఖ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తూనే, పోర్టును, షిప్పింగ్ హార్బర్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ఇది మత్స్యకారుల జీవితాల్లో మార్పు తెస్తుందన్నారు. అభివృద్ధి చెందని ప్రాంతాల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రత్యేక నిధులను కేంద్రం ఇస్తోందని చెప్పారు. నేషనల్ పైప్‌లైన్ స్కీం ద్వారా పెట్టుబడులు రాబోతున్నాయన్నారు. 'మాది సమ్మిళిత అభివృద్ధి దృక్పథం' అని మోడీ చెప్పారు. మత్స్య పరిశ్రమను ఒక ప్రత్యేక అభివృద్ధి రంగంగా మార్చామని అన్నారు. భవిష్యత్తులో నీలి విప్లవం సాధించే దిశగా దేశాభివృద్ధిలో ఇది కీలకం అవుతుందన్నారు. మత్స్యకారులకు క్రెడిట్ కిసాన్ కార్డులు ఇస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు దేశంలోనే కాదు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని ప్రధాని చెప్పారు. ఆంధ్రులు అన్ని రంగాల్లోనూ ప్రత్యేకతను చాటుకుంటున్నారని, సాఫ్ట్‌వేర్ నుండి వైద్యం వరకు అన్ని చోట్లా కనిపిస్తారని, సౌమ్యంగా ఉంటారని చెప్పారు కొన్ని నెలల క్రితం అల్లూరి సీతారామారాజు జయంతి వేడుకల్లో తనకు పాల్గొనే అవకాశం లభించిందన్నారు. ప్రస్తుతం అన్ని దేశాలు ఏదో ఒక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని ప్రధాని అన్నారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రతిదేశమూ భారతదేశం వైపు చూస్తోందన్నారు. మన దేశమే వారందరికీ ఆశావాహ ధృక్పధం ఇస్తోందని, అభివృద్ధిలో కేంద్ర బిందువుగా ఉంటోందని చెప్పారు. వేదికపై ఎపి సిఎం జగన్మోహన్‌రెడ్డి, గవర్నర్ విశ్వభూషన్ హరిచందన్, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఉన్నారు.

ప్రారంభించిన, శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులివే...

రూ.460 కోట్లతో చేపట్టిన విశాఖ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులకు వేదికపై నుంచే మోడీ శంకుస్థా పన చేశారు. రూ.152 కోట్లతో చేపట్టిన విశాఖ ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. రూ.3778 కోట్లతో చేపట్టిన రాయపూర్-విశాఖపట్నం ఎకనమిక్ కారిడార్ గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణ పనులకు, రూ.2658 కోట్లతో చేపట్టిన శ్రీకాకుళం - అంగూల్ సహజ వాయువు పైప్‌లైన్ ప్రాజెక్టుకు, రూ.566 కోట్లతో చేపట్టిన విశాఖ కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వరకూ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.211 కోట్లతో పూర్తి చేసిన నరసన్నపేట-పాతపట్నం రహదారి అభివృద్ధి పనులను, రూ.2917 కోట్లతో నిర్మించిన ఓఎన్‌జిసి-యూ ఫీల్డ్ ఆన్‌షోర్ డీప్ వాటర్ బ్లాక్ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు.

రాజకీయాలకు అతీతమైన బంధం

- రాష్ట్ర ప్రయోజనాలే మా అజెండా : సిఎం జగన్

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర ప్రభుత్వంతోనూ, ప్రధాని మోడీతోనూ తమది రాజకీయాలకు, పార్టీలకు అతీతమైన అనుబంధమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రధాని ప్రసంగానికి ముందు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్య చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే తమ అజెండా అని ఆయన చెప్పారు. 'రాష్ట్ర ప్రయోజనాలు తప్ప మరో అజెండా మాకు లేదు. ఉండదు. ఉండబోదు' అని అని అన్నారు. సమైక్య రాష్ట్ర విభజన గురించి ప్రస్తావిస్తూ 'ఎనిమిదేళ్ల క్రితం విభజన సందర్భంగా అయిన అతి పెద్ద గాయం నుండి రాష్ట్రం ఇంకా కోలుకోలేదు. ఈ గాయం నుండి కోలుకొని జాతీయ స్రవంతితో సమానంగా అభివృద్ధి చెందడానికి మీరు చేసే ప్రతి ప్రత్యేక సాయం, ఏర్పాటు చేసే ప్రతి సంస్థ, అదనంగా ఇచ్చే ప్రతి రూపాయి మా రాష్ట్ర పునర్ నిర్మాణానికి గొప్పగా ఉపయోగపడుతుంది.' అని సిఎం అన్నారు. 'గడిచిన మూడున్నరేళ్ళలో పిల్లల చదువులు, ప్రజల వైద్యం ఆరోగ్యం, రైతుల సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి, పరిపాలన వికేంద్రీకరణకు ప్రాధాన్యత నిచ్చి పారదర్శకంగా అడుగులు వేశాం.రాష్ట్రం నిలదిక్కుకోవడమంటే ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం నిలదొక్కుకోవడం మిగతా 2లో

రాష్ట్రానికి, ప్రజలకు ఉపయోగం లేదు

- ప్రధాని పర్యటనపై సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బేబి, రాఘవులు
- అన్యాయంపై ప్రశ్నించని ముఖ్యమంత్రి
- గవర్నర్లను పావులుగా వాడుతున్న కేంద్రం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి, బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రత్యేక హోదా, రైల్వేజోన్, కడప స్టీల్, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల అభివృద్ధి ఊసెత్తని ప్రధాని వచ్చినందువల్ల రాష్ట్రానికి ఉపయోగం ఏమిటో అర్థం కావడం లేదని, ముఖ్యమంత్రి కూడా కనీసం వాటిపై మోడీని ప్రశ్నించలేదని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి, బి.వి.రాఘవులు అన్నారు. శనివారం మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. మోడీ ప్రసంగం వింటే రాష్ట్రానికి ఇక చేయాల్సిందేమీ లేదన్నట్లు ఉందని అన్నారు. ఆయన హిందీలో మాట్లాడితే, సిఎం జగన్ తెలుగులో మాట్లాడారని, ఒకరి భావాలు ఒకరికి అర్థమైనట్లు అనిపించడం లేదని, అర్థం కాకూడదనే అలా మాట్లాడారో తెలియడం లేదని అన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని బహిరంగ వేదికపై ప్రధాని దృష్టికి తీసుకెళ్లాల్సిన సిఎం ప్రత్యేక అనుబంధం గురించి మాట్లాడారు తప్ప హోదా గురించి మాట్లాడలేదని విమర్శించారు. పార్లమెంటులో ఆమోదించిన విభజన చట్టం అమలును విస్మరించి మోడీ ప్రసంగం సాగిందని తెలిపారు. తెలుగు ప్రజలు ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించబోమని ప్రధాని ప్రకటించలేదన్నారు. విభజన చట్టం, హోదా, పోలవరం ప్రాజెక్టు ముంపులో గిరిజనులకు జరుగుతున్న తీవ్ర అన్యాయంపై కనీస వివరణ ఇవ్వలేదని చెప్పారు. ప్రజలకు ఏ మాత్రమూ ఉపయోగపడని పర్యటనతో డబ్బు, సమయం వృధా చేశారని అన్నారు. ప్రధానితో ప్రత్యేక సంబంధం ఉందని చెబుతున్న ముఖ్యమంత్రి రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై వివరించేందుకు ప్రత్యేక సమయం ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. పవన్‌కల్యాణ్‌ను సమావేశానికి పిలిచి అరగంట మాట్లాడిన ప్రధాని రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఎందుకు మాట్లాడలేదో స్పష్టత ఇవ్వలేదన్నారు. పవన్ అసలు రాష్ట్ర సమస్యలను ఆయనతో ప్రస్తావించినట్లు లేదని అన్నారు. కేవలం స్వప్రయోజనాల కోసం మోడీని కలిసినట్లు ఉందని తెలిపారు. కేంద్రం తీరుపై అన్ని రాష్ట్రాల్లోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంటే ఎపిలో మాత్రం అధికార, ప్రతిపక్షాలు భజన చేసే పనిలో ఉన్నాయన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించేందుకు సిద్ధమైన వామపక్షాల నాయకులను అరెస్టులు చేసి ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. స్టీలు ప్లాంటు ఉద్యోగుల ఆందోళనకు సిపిఎం తరుపున పూర్తి సంఘీభావం ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే ధ్యేయంగా సిపిఎం పనిచేస్తుందని వివరించారు. అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా కోసం మిగతా 2లో

'ఉక్కు' ప్రయివేటీకరణపై వెల్లువెత్తిన నిరసనలు

- పోలీసు అడ్డంకులను అధిగమించి రాస్తారోకో
- 40 మంది అరెస్టు
- మహిళలపై మగ పోలీసుల దురుసు ప్రవర్తన
- స్టీల్‌ప్లాంట్ గేట్లు వద్ద కదంతొక్కిన కార్మికులు
- పరిశ్రమలో టూల్ డౌన్



మద్దిలపాలెంలో సిపిఎం నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి, ఉక్కునగరం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ, రాష్ట్రానికి అన్యాయం చేసిన ప్రధాని మోడీ రాకను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన విశాఖలోని మద్దిలపాలెంలో శనివారం చేపట్టిన నిరసన ప్రదర్శనపై పోలీసులు నిర్బంధం ప్రయోగించారు. పలువురిని అరెస్టు చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, కార్మిక సంఘాల ఆధ్వర్యాన వైజాగ్ స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు, బిసి గేటు వద్ద కార్మికులు కదంతొక్కారు. విధులకు హాజరైన కార్మికులు పరిశ్రమలో టూల్ డౌన్ చేసి తమ నిరసన తెలిపారు. వి.ఎస్.కృష్ణా కాలేజీ రోడ్డు నుంచి మద్దిలపాలెం వైపు ప్రదర్శనగా వెళ్తున్న సిపిఎం, సిపిఐ, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నాయకులను పోలీసులు రోప్‌తో అడ్డుకున్నారు. దీన్ని ఛేదించుకొని నాయకులు మద్దిలపాలెం జాతీయ రహదారిపైకి చేరుకొని రాస్తారోకోకు దిగారు. ఈ నేపథ్యంలో మొత్తం 40 మందిని పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో సిపిఎం, సిపిఐ, ఎస్ఎఫ్ఐ, ప్రజానాట్యమండలి నాయకులు ఉన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.ఈశ్వరమ్మ, బి.పద్మ, పెందుర్తి జోన్ కార్యదర్శి బి.రమణిలను మద్దిలపాలెం కూడలి వైపు వెళ్తున్నప్పుడు పోలీసులు రోప్‌తో అడ్డుకోవడంతో వారు పలుమార్లు కిందపడిపోయారు. మహిళల పట్ల మగ పోలీసులు మిగతా 2లో

హిమాచల్‌లో 65.5 శాతం పోలింగ్



సిమ్లా : హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శనివారం ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకు 65.5 శాతం పోలింగ్ నమోదైంది. కాగా షిల్లాయ్ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 77 శాతం పోలింగ్ నమోదు కాగా సర్కాఘాట్‌లో అత్యల్పంగా 55.40 శాతం నమోదైంది. ఉదయం 8 గంటలకు ఓటింగ్ చాలా పేలవంగా ప్రారంభమైంది. మొదటి గంటలో కేవలం 5 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఆ తర్వాత నెమ్మదిగా పుంజుకుంది. డిసెంబరు 8న ఫలితాలు వెల్లడవుతాయి.

బిటి పని అయిపోయిందా?

- తెగుళ్ల దాడి
- కొత్త పురుగు, వైరస్ వ్యాప్తి
- విత్తనాల ఫెయిల్యూర్స్
- పత్తి రైతు చిత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి



వినాశకర తెగుళ్లు, పురుగుల నుంచి పత్తి పంటను రక్షించే ఉద్దేశంతో రెండు దశాబ్దాల క్రితం దేశంలోకి ప్రవేశించిన బిటి విత్తనాల పని ఇక అయిపోయిందని చెబుతున్నారు. బాసిల్లస్ తురింజన్సిస్ (బిటి)తో జన్యుపరంగా మార్పిడి చేసే టెక్నాలజీని అమెరికాకు చెందిన మోన్‌శాంటో సంస్థ ప్రపంచం మీదికి వదిలింది. భారీ మొత్తంలో రాయల్టీలను, ట్రేట్ వాల్యూలను ముక్కుపిండి వసూలు చేసింది. కాగా ఆ విత్తనాలు తెగుళ్లు, పురుగు నుంచి పంటను రక్షించడం మాట అటుంచి, కొత్త కొత్త తెగుళ్లకు, పురుగుకు, వైరస్‌కు కారణమవుతోంది. పంటకు అంతుబట్టని తెగుళ్లు వ్యాపించడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. దీనికితోడు కల్తీ, నకిలీ, నాసిరకం సీడ్ మూలంగా విత్తనాలు మొలకెత్తక, మొలకెత్తినా పూత, పిందె లేక, పంట ఎదగక నష్టాలు చవి చూస్తున్నారు.

జవాబుదారీ లేదు

బిటిలో బిటి-1, బిటి-2.. రెండు రకాల విత్తనాలకు అనుమతులున్నాయి. ఇప్పుడు బిటి-2 విత్తనాలే నూటికి నూరు శాతం చెలామణిలో ఉన్నాయి. బిటి టెక్నాలజీ వచ్చిన మొదట్లో పత్తికి ఆశించే అన్ని రకాల తెగుళ్లనూ ఎదుర్కొంటాయని ప్రచారం చేశారు. అనంతరం ఒక్క శనగపచ్చ పురుగును మాత్రమే ఎదుర్కొంటుందన్నారు. ఎకరానికి 450 గ్రాముల బిటి, 120 గ్రాముల నాన్-బిటి విత్తనాలను వేయాలన్నారు. రెండు రకాల విత్తనాలనూ రైతులకు ఇవ్వాలి. బిటి పంటను పురుగు ఆశించకుండా రిఫ్యూజ్ క్రాప్ కింద నాన్-బిటి వేయాలని సిఫారసు చేశారు. ముందుగా నాన్-బిటికి పురుగులు వ్యాపిస్తాయి. అది బిటి విత్తనాల్లో కొంత కాలం వ్యాధి నిరోధక శక్తి (రెసిస్టెన్స్)కి తోడ్పడుతుంది. కానీ విత్తనాలు అమ్ముకోవడమే తప్ప రిఫ్యూజ్ క్రాప్ వేయమని రైతులకు కంపెనీలు చెప్పలేదు. వ్యవసాయశాఖ సైతం రైతులకు తగిన సూచనలు ఇవ్వలేదు. అధిక దిగుబడి పేరిట ఎకరాకు రెండు మూడు బిటి సీడ్ ప్యాకెట్లను రైతులు వేశారు. దాంతో కొన్నేళ్లకే తెగుళ్లు పత్తిని ఆశిస్తున్నాయి. గులాబీ కాయతొలుచు పురుగు, పొగాకు లద్దె పురుగు, పేనుబంక, పచ్చదోమ, తెల్లదోమ, తామర వంటివి వ్యాపించి పంటను సర్వనాశనం చేస్తున్నాయి.

కేంద్ర విధానంలో మార్పు

రిఫ్యూజ్ క్రాప్ వేయకపోవడం వలన దుష్పరిణామాలు తలెత్తుతున్నాయంటూ కేంద్రం 450 గ్రాముల బిటి సీడ్‌లోనే కనీసం 5 శాతానికి తగ్గకుండా, గరిష్టంగా 10 శాతానికి మించకుండా నాన్-బిటి సీడ్‌ను కలిపి అమ్మాలంది. ఇది విత్తన కంపెనీల అక్రమాలకు అనుకూలంగా తయారైందని ఆరోపణలొస్తున్నాయి. నాన్-బిటి విత్తనాలను ఎక్కువ మోతాదులో కలిపి అమ్మారని, అందుకే మొక్కలు రాలేదని, విత్తనాలు ఫెయిల్ అయ్యాయని రైతుల నుంచి ఫిర్యాదులందుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆందోళనలు జరుగుతున్నాయి. మరికొన్ని జిల్లాల్లోనూ రైతుల్లో అనుమానాలు రేకెత్తాయి.

వాతావరణంపై నెపం

బిటి విత్తనాలు మొలకెత్తకపోవడానికి, పంట ఎదగపోవడానికి, తెగుళ్లు వ్యాపించడానికి వర్షాభావం, అధిక వర్షాలు, డ్రై-స్పెల్స్ కారణమని సీడ్ కంపెనీలు మిగతా 2లో

చట్టం అణచివేత పరికరం కారాదు

- సిజెఐ డివై చంద్రచూడ్

న్యూఢిల్లీ : చట్టాన్ని ప్రజలను అణచివేసే పరికరంగా ఉపయోగించరాదని, న్యాయాన్ని ప్రసాదించే పరికరంగానే ఉపయోగించాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ స్పష్టం చేశారు. న్యాయస్థానాలే కాకుండా విధాన నిర్ణేతలు కూడా ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని అన్నారు. 'హిందూస్థాన్ టైమ్స్' నిర్వహించిన నాయకత్వ సదస్సులో ఆయన ప్రసంగించారు. సంస్థలుగా న్యాయస్థానాల సమర్థతకు కూడా పరిమితులు ఉంటాయని అర్థం చేసుకోవాలన్నారు. కొన్ని సందర్భాల్లో చట్టం, న్యాయం ఒకే దారిలో నడవాలని తప్పనిసరి సూత్రమేదీ లేదన్నారు. ఒక చట్టాన్ని న్యాయ పరికరంగానూ, అదే చట్టాన్ని అణిచివేత పరికరంగానూ వాడే వీలుందన్నారు. మన శాసన పుస్తకాల్లో ఇప్పటికీ ఉనికిలో ఉన్న చట్టాలనే బ్రిటీష్ వలసవాద పాలనలో ఎంతటి తీవ్ర అణచివేతకు ఉపయోగించారో ఆయన గుర్తు చేశారు. పౌరులుగా మనమందరం ఒక చట్టాన్ని ఎలా ఉపయోగించాలనేది విజ్ఞతతో వ్యవహరించాల్సిన అంశమని ఆయన తెలిపారు. ఇదే విషయాన్ని న్యాయమూర్తులే గాక విధాన నిర్ణేతలు (పాలకులు) అందరూ గమనంలో ఉంచుకోవాలని పునరుద్ఘాటించారు. ప్రజల ఈతిబాధలను అర్థం చేసుకొని, సమస్యలను పరిష్కరించాలనే ధృఢ సంకల్పంతో కృషి చేస్తేనే న్యాయ సంస్థలు సుదీర్ఘకాలం మనుగడ సాగించగలవని తెలిపారు. 'వ్యవస్థలో గొంతెత్తలేని వారి గొంతు నువ్వు వినగలిగితే.. మీరప్పటి వరకు వ్యవస్థలో చూడని ముఖాలు ముందుకొస్తాయి. అక్కడే చట్టం, న్యాయం మధ్య మీరు పాటించే సమతుల్యత ఏపాటిదో తేలిపోతుంది.' అని న్యాయమూర్తులను ఉద్దేశించి జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తులు - న్యాయవాదుల మధ్య అసందర్భ సంభాషణలు సత్యాన్ని ముందుకు తీసుకెళ్లలేవని, అంతిమ సారాంశాన్నే తెలియజేయాలని సూచించారు.



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న స్టాలిన్

ఇడబ్ల్యుఎస్ తీర్పుపై రివ్యూ పిటిషన్

- తమిళనాడు అఖిలపక్ష సమావేశం తీర్మానం

చెన్నయ్ : ఆర్థికంగా బలహీన తరగతులకు (ఇడబ్ల్యుఎస్) పది శాతం రిజర్వేషన్ కోటాను తమిళనాడు తీవ్రంగా వ్యతిరేకించింది. ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ అధ్యక్షతన శనివారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ఇడబ్ల్యుఎస్ కోటా కల్పిస్తూ తీసుకొచ్చిన 103వ రాజ్యాంగ సవరణను సమావేశం ముక్తకంఠంతో తిరస్కరించింది. కోటాను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పును సమీక్షించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేయాలని సమావేశం నిర్ణయించింది. రాజ్యాంగంలో పేర్కొన్న సామాజిక న్యాయం నిబంధనకు ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ పూర్తి విరుద్ధంగా వుందని ఆ తీర్మానం పేర్కొంది. తమిళనాడు ప్రభుత్వం తన వాదనను సమర్థవంతంగా, గట్టిగా వినిపించాలని కోరింది. అంతకుముందు సమావేశంలో ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ, రాజ్యాంగ నిబంధనల ప్రకారం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారికి మాత్రమే రిజర్వేషన్లు ఇవ్వాలని, అందులో ఆర్థిక అంశాన్ని చేర్చరాదని స్పష్టం చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి కె పొన్ముడి మాట్లాడుతూ ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌ను రాష్ట్రంలో అమలు చేయబోమని తెలిపారు. అన్నా డిఎంకె, బిజెపి ఈ సమావేశాన్ని బహిష్కరించాయి. మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీర్‌సెల్వం గ్రూపు కూడా సమావేశంలో పాల్గొనలేదు. కాంగ్రెస్, పిఎంకె, ఎండిఎంకె, విసికె, సిపిఎం, సిపిఐ, మణితనేయ మక్కల్ కట్చి, తమిళగ వాల్వురిమయ్ కట్చి, కొంగునడు మక్కల్ దేశీయ కట్చి పార్టీల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు

పెంచిన గ్రీన్ ట్యాక్స్ ఉపసంహరించుకోండి

- సిఎంకు లారీ ఓనర్స్ అసోసియేషన్ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రవాణా వాహనాలకు పెంచిన గ్రీన్ ట్యాక్స్‌ను ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరరావు శనివారం లేఖ రాశారు. రాష్ట్రప్రభుత్వం ప్రస్తుతం రూ.200లుగా ఉన్న గ్రీన్ ట్యాక్స్‌ను పెంచిందని తెలిపారు. దీంతో లారీ పరిమితిని బట్టి రూ.6ల నుంచి రూ.20వేల భారం యాజమానులపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సరిహద్దు రాష్ట్రాల్లో ఎక్కడా కూడా ఈ స్థాయిలో గ్రీన్‌ట్యాక్స్ లేదని తెలిపారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రస్తుతం ఏడాదికి రూ.200ల నుంచి రూ.500లు మాత్రమే వసూలు చేస్తున్నాయని వివరించారు. ఈ విషయాన్ని పరిశీలించి పెంచిన గ్రీన్ ట్యాక్స్ వెంటనే తగ్గించి రాష్ట్రంలోని రవాణా రంగానికి కొంత ఊరట కల్పించాలని కోరారు.

వ్యాసరచన పోటీలకు ఐద్వా ఆహ్వానం

- డిసెంబరు1లోగా వ్యాసాలు పంపాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం ఏర్పడి 75 సంవత్సరాలైన సందర్భంగా ఐద్వా వజ్రోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పేర్కొంది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. సీనియర్స్ విభాగానికి "స్త్రీపురుషుల సమానత సాధనలో స్వాతంత్ర్యం - తదనంతర పరిణామాలు" అనే అంశం, జూనియర్స్ విభాగానికి "మద్యం, మత్తుమందుల ప్రభావం- నివారణకు మార్గాలు" అనే అంశాలపై వ్యాసాలు రాయాల్సి ఉంటుందని తెలిపారు. 16 సంవత్సరాలలోపు వయసు ఉన్న వారిని జూనియర్స్‌గానూ, 16 ఏళ్లకు పైబడిన వారిని సీనియర్స్‌గాను పరిగణించబడతారని ఐద్వా పేర్కొంది. చేతి రాతలో ఆరు పేజీలు, టైపింగ్‌లో రెండు పేజీలకు మించరాదన్నారు. వ్యాస పత్రంపై వ్యాసరచయిత పేరు రాయకూడదని, వ్యాసం సొంత రచన అని హామీ పత్రం వేరుగా రాయాలని, అందులోనే మీ పేరు, తరగతి, వృత్తి, చిరునామా ఫోన్ నెంబరు వివరాలు ఉండాలన్నారు. రాసిన వ్యాసాన్ని డిసెంబరు 1వ తేదీలోగా ఐద్వా మెయిల్ aidwaa-porg@gmail.com లేక పోస్టల్‌లో వ్యాసాలు పంపే వారు మోటూరు ఉదయం భవన్, డిజిపి ఆఫీస్‌రోడ్డు, కొలనుకొండ, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా చిరునామాకు పంపాలని ఐద్వా పేర్కొంది. అదనపు సమాచారం కోసం 9490098620, 9490300895, 9949741041 నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

మోడీ పర్యటనతో ఒరిగిందేమిటి : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రధాన మంత్రి నరేంద్రమోడీ రాష్ట్ర పర్యటన వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమిటో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమాధానం చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రానికి మరోసారి మొండిచేయి చూపిన మోడీ వైఖరికి నిరసనగా వైసిపి ఎంపిలతో తక్షణమే రాజీనామా చేయించాలని సిఎంను శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేసి సిఎం నిర్వహించిన విశాఖ సభ మోడీని ప్రసన్నం చేసుకోవడానికి ఆడిన డ్రామా అని పేర్కొన్నారు. మోడీ చెప్పాల్సింది చెప్పి వెళ్లిపోయారే తప్ప రాష్ట్రానికి మేలు జరిగే ఏ ఒక్క అంశంపైగాని, సిఎం ప్రస్తావించిన వాటిపై కాని సమాధానం చెప్పలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ఇప్పటికైనా గళమెత్తాలని డిమాండ్ చేశారు.

లైంగిక వేధింపులకు పాల్పడ్డ పిఆర్ఒ

- పాఠశాల ఎదుట బాధితురాలి తల్లిదండ్రుల ఆందోళన
- నిందితుడిపై కేసు నమోదు

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరులోని తెలుగు గంగ కాలనీ సమీపంలోని ఓవెల పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల ఆ స్కూల్ పిఆర్ఒ బ్రహ్మయ్య లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. వేధింపులు మితిమీరడంతో విద్యార్థిని శనివారం తల్లిదండ్రుల దృష్టికి తీసుకువచ్చింది. దీంతో వారు విద్యార్థిని వెంటబెట్టుకుని పాఠశాలకు వచ్చారు. విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. వారు స్పందించకపోవడంతో పిఆర్ఒపై దాడికి యత్నించారు. దీంతో బ్రహ్మయ్యను యాజమాన్యం అక్కడి నుంచి పంపివేసింది. ఆగ్రహించిన తల్లిందడ్రులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. పాఠశాల నుంచి వెళ్లిపోతున్న పిఆర్ఒ బాధితుల కంటపడటంతో మరోసారి దాడికి పాల్పడ్డారు. దీంతో యాజమాన్యం బ్రహ్మయ్యను పాఠశాలలోని ఓ గదిలో పెట్టి తలుపులు మూసి వేసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పిఆర్ఒను అదుపులోకి తీసుకున్నారు. నిందితునిపై పోక్సో ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేసినట్లు ఎస్‌పి సిహెచ్ విజయరావు పేర్కొన్నారు. జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించామని తెలిపారు. నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు.

రాష్ట్రానికి, ప్రజలకు ఉపయోగం లేదు

(మొదటి పేజీ తరువాయి)

చట్టం చేస్తానని రాహుల్‌గాంధీ హామీనివ్వడం మంచిదేనని తెలిపారు.

దక్షిణాది రాష్ట్రాల్లో గందరగోళం చేస్తున్న గవర్నర్లు

దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో గవర్నర్లు గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాలు, చట్టసభలకు వారు సలహాదారులుగా మాత్రమే ఉండాలని సుప్రీం కోర్టు చెప్పినా పట్టించుకోవడం లేదని, నేరుగా పాలనాపరమైన అంశాల్లో జోక్యం చేసుకుంటున్నారని విమర్శించారు. గవర్నర్లను మోడీ, అమిత్‌షాలు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఏజెంట్లుగా వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. కేరళ గవర్నర్ ప్రతిరోజూ మీడియాతో మాట్లాడుతూ వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని అన్నారు. దేశంలో పెరుగుతున్న ఆకలి, నిరుద్యోగం, నిరక్షరాస్యత, పిల్లల మరణాలు వంటి సమస్యలు కేంద్రానికి పట్టడం లేదని, కేవలం ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలను కూల్చడం ఎలాగనే అంశంపైనే వారి దృష్టి ఉందన్నారు. దేశం వెలిగిపోతోందని పదే పదే మోడీ చెప్పే మాటల్లో వాస్తవం లేదని అన్నారు.

జెట్టీ నిర్మించండి

- ఎన్ఎఒబి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం
- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు



మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - రాంబిల్లి (అనకాపల్లి)

నేవల్ ఆల్టర్‌నేటివ్ ఆపరేషన్స్ బేస్ (ఎన్ఎఒబి) నిర్వాసిత, ప్రభావిత మత్స్యకారులు, మత్స్యకారేతరులు తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఐక్యంగా పోరాడాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు కోరారు. 13 రోజులుగా నేవల్ బేస్ మెయిన్ గేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నిర్వాసితులకు ఆయన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఎఒబి వద్ద జెట్టీ నిర్మించి మత్స్యకారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకపోతే అనకాపల్లి జాతీయ రహదారిని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. నిర్వాసిత మత్స్యకారులు, మత్స్యకారేతరులకు అన్యాయం జరగకుండా 2013 భూ అధికరణ, పునరావాస చట్టాన్ని అమలు చేసి అన్ని రకాల ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. భూ సేకరణ చట్టంలో పేర్కొన్నట్లు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, శాశ్వత ఉద్యోగాల్లో 75 శాతం స్థానికులకు కేటాయించాలని, గంప మహిళలకు లక్ష రూపాయలు చెల్లించాలని కోరారు. 17 ఏళ్లవుతున్నా నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగదన్నారు. మత్స్యకారులకు జెట్టీ లేకపోతే ఎలా బతుకుతారన్న ఆలోచన ప్రభుత్వాలకు లేకపోవడం బాధాకరమన్నారు. నిర్వాసితుల చట్టాలు, జిఒలను ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేయకపోవడం వల్లే జీవనోపాధిపోయిన నిర్వాసితులు న్యాయం కోసం పోరాటం చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఆందోళనలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి జి.దేవుడు నాయుడు, ఐద్వా జిల్లా నాయకులు కె.నూకరత్నం, జి.లక్ష్మి, నిర్వాసిత గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'ఉక్కు' పరిరక్షణ పోరాట యోధులకు జేజేలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రభుత్వం ఉక్కుపాదం మోపినప్పటికీ వెరవకుండా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాడి శుక్రవారం అరెస్టయిన కార్మికులు శనివారం పెందుర్తి పోలీసు స్టేషన్ నుంచి విడుదలయ్యారు. విడుదలైన కార్మికులకు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ జేజేలు పలికింది. కార్మిక సంఘాల నేతలను యువ నాయకులు కూర్మన్నపాలెం కూడలిలోని దీక్షా శిబిరం వద్ద సన్మానించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ఉక్కు పోరాటంలో నిర్బంధాలు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు శాంతియుతంగా జరిగిన ఏ కార్యక్రమంలోనూ కార్మిక నాయకులను అరెస్టు చేసిన సంఘటనలు లేవన్నారు. ఈ పోరాటం మరింత ఉధృతం కానుందని స్పష్టం చేశారు. కార్మికులంతా మరింత అప్రమత్తంగా ఉండి ఈ పోరాటాన్ని మరో రెండేళ్ల పాటు ఇదే విధంగా కొనసాగించేందుకు సిద్ధం కావాలన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ పోరాట పంథా మార్చాల్సిన అవసరముందని తెలిపారు. కేవలం కార్మికులనేకాక ఇతర రంగాల వారిని, ప్రజలను, స్థానిక నేతలను, రాజకీయ పార్టీల వారిని కలిపి ఈ పోరాటాన్ని భారీ ఎత్తున నిర్మించాలన్నారు. పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, ఎం. ఎం రాజశేఖర్ మాట్లాడుతూ నిర్బంధాలు, అరెస్టులు పోరాటాలను నిలువరించలేవన్నారు. స్టీల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 639 రోజుకు చేరాయి. దీక్షల్లో పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్ఎన్.రావు, కో కన్వీనర్ జె.అయోధ్యరాం, నాయకులు వైటి.దాసు, వి.ప్రసాద్, రామస్వామి, మస్తానప్ప, డివి.రమణారెడ్డి, కెఎం.శ్రీనివాస్, కసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, రాధాకృష్ణ తదితరులు

కౌలు రైతుల రాష్ట్ర మహాసభ విజయవంతం చేయాలి

- కెఎస్ లక్ష్మణరావు, వై.రాధాకృష్ణ

ప్రజాశక్తి - చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ కోరారు. ఈ మేరకు పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో శనివారం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం తృతీయ మహాసభ ఈనెల 21, 22 తేదీల్లో చిలకలూరిపేటలో నిర్వహించనున్నట్టు తెలిపారు. 21న ఉదయం పది గంటలకు చిలకలూరిపేటలోని నన్నపనేని వెంకటరత్నం కన్వెన్షన్ హాల్‌లో ప్రారంభ సభ, సాయంత్రం ఐదు గంటలకు కళా మందిర్ సెంటర్‌లో బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. బహిరంగ సభలో ఎఐకెఎస్ జాతీయ కార్యదర్శి విజుకృష్ణన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ప్రారంభ సభలో విజుకృష్ణన్ ప్రారంభోపన్యాసం చేస్తారన్నారు. 22న ప్రతినిధుల సభ జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఈ మహాసభలో చర్చించి తీర్మానాలు చేస్తారని తెలిపారు. కౌలు రైతులను గుర్తించేందుకు కౌలు రైతుచట్టంలో ఉన్న భూ యజమానుల అనుమతి నిబంధనలను తొలగించాలని, పంట బీమాను కౌలు రైతుల పేరున చేయాలని, రుణమాఫీలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను రద్దు చేయాలని, షరతులు లేకుండా కౌలు రౌతులకు రుణాలు అందివ్వాలని తదితర డిమాండ్లపై చర్చించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ లక్ష్మమేశ్వరరెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ గోపాలరావు పాల్గొన్నారు.

సివిల్ సప్లై కుంభకోణంలో నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన



నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో నినాదాలు చేస్తున్న రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

పౌర సరఫరా కార్యాలయంలో జరిగిన అవినీతి కుంభకోణంపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి అసలు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్‌లో ఆయా సంఘాల నేతలు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలె వెంగయ్య మాట్లాడుతూ.. పౌరసరఫరాల శాఖలో అనేక రకాలుగా అవినీతి చోటు చేసుకుందన్నారు. రూ.40 కోట్ల మేరకు నగదు దుర్వినియోగమైందని ప్రభుత్వమే ప్రకటించిన ప్పటికీ దాదాపుగా రూ.100 కోట్ల మేరకు అవినీతి అక్రమాలు జరిగాయని తెలిపారు. ఇంతటి స్థాయిలో అవినీతి చోటుచేసుకుంటే అధికారులపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అవినీతి వ్యవహారంలో పాత్రదారుల నుంచి నగదు రికవరీ చేసి రైతుల బకాయిలను పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పులిగండ్ల శ్రీరాములు మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకునేందుకు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. అష్టకష్టాలు పడి రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే అధికారులు, మిల్లర్లు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని, ధాన్యం తోలిన రైతులకు రవాణా ఛార్జీలు చెల్లించాలని, రైతుల కష్టం దిగమించిన అవినీతి అధికారులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య, ఆలూరి తిరుపాలు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రయివేటీకరణపై వెల్లువెత్తిన నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహరించిన తీరును పలువురు తప్పుపట్టారు. పోలీసులను కొందరు నిలదీశారు. ముగ్గురు మహిళా నాయకులు దాదాపు గంటపాటు పోలీసు వలయం మధ్యలో ఉంటూనే 'స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించవద్దు', 'రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి' అంటూ నినాదాలు చేశారు. అక్రమ అరెస్టులను ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి ఖండించారు. మహిళలను మగ పోలీసులు అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసన

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుల అరెస్టును ఖండిస్తూ పోరాట కమిటీ, అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేట్, బిసి గేట్ వద్ద కార్మికులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు పెద్ద పెట్టున నినదించారు. ప్లాంట్ లోపలికి వెళ్లే ఈ రెండు ప్రధాన ద్వారాలు వద్ద నిరసనలు హోరెత్తాయి. మెయిన్ గేట్ వద్ద కార్మిక నేతలకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. స్టీల్‌ప్లాంట్ లోపల కూడా వివిధ విభాగాల్లో కార్మికులు ఆందోళన చేపట్టారు. కార్మిక నేతలు విడుదలయ్యే వరకు పనిచేసేది లేదంటూ టూల్ డౌన్ పాటించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్టీల్ హెచ్ఒడి విభాగాల ముందు కార్మికులు ధర్నా చేశారు. మెయిన్ గేటు వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ అదానీ, అంబానీలాంటి కార్పొరేట్లకు స్టీల్‌ప్లాంట్‌ను కట్టబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు దుర్మార్గమైనవన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, ప్రభుత్వ రంగంలోనే కర్మాగారాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రజా సంపదను కాపాడుకోవడం కోసం ఎంతవరకైనా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ మోడీ గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను గౌరవించి స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉక్కు బిసి గేటు వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడారు.

రాజకీయాలకు అతీతమైన బంధం

(మొదటి పేజీ తరువాయి)

అని నమ్మి, ప్రతి ఇంటా ఆత్మవిశ్వాసం నింపడానికి మా ఆర్థికవనరుల్లో ప్రతి రూపాయిని సద్వినియోగం చేశాం. ఒక రాష్ట్ర ప్రభుత్వంగా మా శక్తి మేరకు మేం చేస్తున్న ప్రయత్నాలకు మీరు, మీ సహాయ సహకారాలను మరింతగా అందించాలి.' అని కోరారు.

విజ్ఞప్తులను పరిష్కరించండి

రాష్ట్ర ప్రజలందరి తరపున. రాష్ట్ర అభివృద్ధి దృష్ట్యా చేసిన విజ్ఞప్తులను పరిష్కరించాలని ప్రధానికి సిఎం జగన్ విజ్ఞప్తి చేశారు.

'విభజన సంబంధించిన హామీల దగ్గరనుంచి, పోలవరం నుండి ప్రత్యేకహోదా వరకు, విశాఖ పట్నం స్టీల్ ప్లాంటు దగ్గరనుండి రైల్వే జోన్ వరకు పలు అంశాల మీద, పలుసందర్భాల్లో మీకు చేసిన విజ్ఞప్తులను మీరు సానుకూలంగా పరిగణలోకి తీసుకుని, వాటిని పరిష్కరించాలని కోరుతున్నా' అని సిఎం అన్నారు. సిఎం తన ప్రసంగంలో రాష్ట్రానికి చెందిన ప్రముఖ కవుల కవితలు, పాటలు గుర్తు చేశారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై విస్తృత పోరాటాలు

- సిడబ్ల్యుఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి శశికుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శశికుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని కనస్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి శశికుమార్ తెలిపారు. విజయవాడలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, అధ్యక్షులు ఎన్.రమణరావు, ప్రధాన కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు, ఉపాధ్యక్షులు పిల్లి నరసింహారావు, కోశాధికారి కెవి గోపాలరావు తదితరులతో కలిసి శశికుమార్ మాట్లాడారు. ఇనుము, ఇసుక, కంకర, సిమెంటు తదితర మెటీరియల్ ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల పన్నులతో విపరీతంగా పెంచి నిర్మాణ రంగంమీద పెనుభారం మోపారని తెలిపారు. దీంతో పనులు తగ్గి ఉపాధి పోతోందని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నిర్మాణ రంగం పట్ల వివక్ష చూపుతోందని పేర్కొన్నారు. నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా వచ్చే పథకాలకు సర్క్యులరు విడుదల చేసి నిలిపేసిందని వివరించారు. క్లెయిములకు సంబంధించి రాష్ట్రంలో 60 వేలమందికి పైగా రావాల్సి ఉందని తెలిపారు. రూ.120 కోట్లు రావాల్సి ఉండగా, ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని వివరించారు. సంక్షేమ బోర్డు నిధులు రూ.831 కోట్లను ప్రభుత్వం తన అవసరాల కోసం వాడుకుందని చెప్పారు. పక్కదారి పట్టించిన నిధులను బోర్డుకు జమ చేయడం కోసం రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేపడతామని వివరించారు. గుడివాడలో జరిగిన మహాసభలో భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలపై చర్చించామని పేర్కొన్నారు. విలేకరుల సమావే శంలో నాయకులు సాంబశివ, బెనర్జీ, ఏడుకొండలు, వేణు, బాబూరావు, గోవిందు, రాము, ఎంవి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సవాంగ్ ఐపిఎస్ రిటైర్‌మెంట్‌కు ప్రభుత్వం ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ డిజిపి, ఎపిపిఎస్‌సి చైర్మన్ డి గౌతం సవాంగ్ ఐపిఎస్ రిటైర్‌మెంట్‌కు రాష్ట్రప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ శనివారం విడుదల చేశారు. డిజిపిగా ఉన్న సవాంగ్‌ను రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 15న ఆకస్మికంగా బదిలీ చేసింది. అనంతరం ఆయనను ఎపిపిఎస్‌సి చైర్మన్‌గా నియమించింది. చైర్మన్ బాధ్యతలు తీసుకున్న తరువాత ఐపిఎస్‌కు రిటైర్‌మెంట్ చేసినట్లుగా ప్రభుత్వం పేర్కొంది.



గ్రంథాలయ వారోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ శేషగిరిరావు తదితరులు

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

- గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 14 నుంచి 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు వెల్లడించారు. గ్రంథాలయాలు అందిస్తున్న సేవలను ప్రజలకు తెలియజేయడం, నేటి తరాలను గ్రంథాలయాలకు సన్నిహితం చేయడమే ధ్యేయంగా ఈ నెల 20వ తేదీ వరకు రాష్ట్రప్రభుత్వం ఘనంగా నిర్వహించనుందని తెలిపారు. విజయవాడలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రంథాలయ వ్యవస్థ ఫరిడవిల్లాలని కాలానుగుణంగా డిజిటల్ విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. జాతీయ ఉద్యమంలో గ్రంథాలయాలు భాగస్వామ్యం అయ్యాయని తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ వారోత్సవాలను మంత్రులు తానేటి వనిత, బొత్స సత్యనారాయణ ప్రారంభిస్తారని చెప్పారు. ప్రభుత్వ పౌర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ ఎంఆర్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలు, దిశ చట్టంపై అవగాహన కార్యక్రమాలతో ఈ వారోత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రవిభజన తరువాత రాష్ట్రంలో గ్రంథాలయాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ఈ వారోత్సవాలను ఒక అవకాశంగా వినియోగించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర గ్రంథాలయ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ షేక్ పీర్ అహ్మద్, కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ టి జమలపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విజ్ఞానం నిరంతరం పెంచుకోవాలి

- రాష్ట్ర స్థాయి వైద్య వైజ్ఞానిక సదస్సులో శ్యాంప్రసాద్

ప్రజాశక్తి - నంద్యాల

వైద్య రంగంలో నిరంతరం మార్పులు వస్తుంటాయని, అందుకు అనుగుణంగా వైద్యులు తమ పరిజ్ఞానాన్ని నిత్యం పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎపి రాష్ట్ర డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డాక్టర్ శ్యాంప్రసాద్ అన్నారు. రెండురోజులపాటు జరగనున్న ఎపి రాష్ట్ర ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఏడవ రాష్ట్ర వైద్య వైజ్ఞానిక సదస్సును నంద్యాలలోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రారంభమైంది.. ముఖ్య అతిథిగా శ్యాం ప్రసాద్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ సదస్సులో 27 మంది వివిధ వైద్య నిపుణులు వివిధ అంశాలపై ప్రసంగించడం అభినందనీయమన్నారు. ఇంత చక్కటి సదస్సుకు వేదిక కావడం శుభపరిణామమని తెలిపారు. ఈ సదస్సుకు వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.



'సైన్సు నాటికలు', 'మ్యాజిక్కు- లాజిక్కు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీలు, విసి ప్రసాద్‌రాజు, తదితరులు

ప్రజాసైన్స్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలి

- జెవివి 17వ రాష్ట్ర ప్లీనరీలో ఎమ్మెల్సీలు ఐవి, షేక్ సాబ్జీ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, పర్యావరణం కోసం సైన్స్ నినాదాలతో పనిచేస్తోన్న జన విజ్ఞాన వేదిక ప్రజాసైన్స్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు మరింత కృషి చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ, ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. రెండు రోజుల పాటు జరగనున్న జనవిజ్ఞాన వేదిక 17వ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు కాకినాడ జెఎన్‌టియుకెలో శనివారం ప్రారంభమయ్యాయి. జెవివి రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఐవి మాట్లాడుతూ.. మూఢనమ్మకాలను పారదోలేందుకు, ప్రజల్లో చైతన్యం నింపేందుకు జెవివి అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అందరికీ ఆరోగ్యం కావాలని, మందుల కోసం మనుషులు కాకుండా మనుషుల కోసం మందులు ఉండాలని ప్రశ్నించిందన్నారు. కేరళ స్ఫూర్తితో ఎపిలో అనేక సైన్సు ఉద్యమాలు నిర్వహించిందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వనరులను కాపాడుకోవడం వంటి అనేక అంశాలపై ప్రజలను చైతన్యవంతం చేస్తోందన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన జెఎన్‌టియుకె విసి జివిఆర్.ప్రసాద్‌రాజు మాట్లాడుతూ.. గుణాత్మక విద్యను సాకారం చేయడం, భావి పౌరులను సరైన మార్గంలో పెట్టగలిగే సామర్థ్యం ఒక్క ఉపాధ్యాయులకే ఉందన్నారు. ఈ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో జెవివి చేస్తోన్న కృషిని శ్లాఘించారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ.. శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారం చేయడంలో జెవివి కృషి ఎనలేనిదన్నారు. తన ప్రస్థానంలో అనేక ఉద్యమాలు నిర్వహించిందన్నారు.జెవివి రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ స్టాలిన్, డా జి.శివన్నారాయణ, పూర్వపు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చల్లా రవికుమార్, రాష్ట్ర నాయకులు మురళీధర్, త్రిమూర్తులు తదితరులు మాట్లాడారు. 1988లో జెవివి ఏర్పడినప్పటి నుంచి ప్రజలను చైతన్యవంతం చేసేందుకు అనేక కార్యక్రమాలు, ఉద్యమాలు నిర్వహించిందన్నారు. భవిష్యత్తులో మరింత బలమైన ఉద్యమాలు నిర్మించే దిశగా కార్యకర్తలు పునరంకితం అవ్వాలని ఆకాంక్షించారు. అనంతరం 'సైన్సు నాటికలు', 'మ్యాజిక్కు-లాజిక్కు', స్పేస్ సైన్సు గ్రంథాన్ని ఆవిష్కరించారు.

ఇద్దరు చిన్నారులతో సహా తల్లి ఆత్మహత్యాయత్నం

- తల్లి, కుమారుడు మృతి, కుమార్తె పరిస్థితి విషమం

ప్రజాశక్తి - నరసరావుపేట (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో భార్య ఇద్దరు పిల్లలతో సహా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన నూజెండ్ల మండలం తెల్లబాడు గ్రామంలో శనివారం జరిగింది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట పట్టణానికి చెందిన గోలి సౌజన్య లక్ష్మి(26)కి, నూజెండ్ల మండలం తెల్లపాడు గ్రామానికి చెందిన మాదం రామాంజనేయులుతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. రామాంజనేయులు వినుకొండ పట్టణంలోని మొబైల్ షాప్‌లో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. భర్త వివాహేతర సంబంధం కారణంగా గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సౌజన్య లక్ష్మి తన ఇద్దరు పిల్లలు శివ పార్వతి (3), మణి తేజ (9 నెలలు)కి పురుగుల మందు తాగించి, తానూ తాగింది. అపస్మారకస్థితిలో పడి ఉన్న వారి ముగ్గురిని కుటుంబ సభ్యులు నరసరావుపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సౌజన్య లక్ష్మి, మణితేజా మృతి చెందారు. శివపార్వతి పరిస్థితి విషమంగా ఉంది. సౌజన్యలక్ష్మి తల్లి వెంకటరమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బిటి పని అయిపోయిందా?

(మొదటి పేజీ తరువాయి)

తప్పించుకుంటున్నాయి. ప్రభుత్వమూ వంత పాడుతోంది. గతేడాది ఖరీఫ్‌లో 'కావేరి' విత్తనాలు ఫెయిల్ కాగా ఇప్పటి వరకు ఆ సంస్థపై ఎలాంటి చర్యలూ లేవు. ఇప్పుడు 'అకిర' విత్తనాలు ఎక్కువగా ఫెయిల్ అయ్యాయని ఫిర్యాదులొస్తున్నాయి. ఇదిలా ఉండగా అనుమతుల్లేని బిటి-3 విత్తనాల అమ్మకాలూ సాగుతున్నాయి. పత్తి పండే ప్రాంతాల్లో కొన్ని చోట్ల 70 శాతం వరకు ఈ విత్తనాలే వేశారు. కలుపు మందు కొట్టినా మొక్కలు బతుకుతాయని, కూలీల ఖర్చు మిగులుతుందని, అధిక దిగుబడి వస్తుందని ప్రచారం చేసి రైతులను ఆకట్టుకుంటున్నారు. గుంటూరు లాం ఫాం కాటన్ ప్రిన్సిపల్ సైంటిస్టు ఎం సుధారాణిని సంప్రదించగా, బిటి టెక్నాలజీ ఫెయిల్ అయినట్లు గుర్తించలేదన్నారు. గులాబీ, ఇత్యాది పురుగు విషయంలో మాత్రం వైఫల్యం ఉందని తెలిపారు. వంద రోజులు మాత్రమే మొక్కలో 'బిటి' సామర్థ్యం ఉంటుందన్నారు. సీజన్‌ను సరిగ్గా పాటించట్లేదని చెప్పారు. పంట తీశాక పొలాలను కొన్ని నెలలు ఖాళీగా ఉంచడమో లేదంటే ఇతర పంటలు వేయడమో చేయాలన్నారు. ఈ పద్ధతి పాటించకపోవడం వల్లనే అనర్థాలొస్తున్నాయని వివరించారు. బిటి విత్తనాల్లో నాన్-బిటి విత్తనాలు కలపాలన్న కేంద్ర ఆదేశాలు విధాన నిర్ణయమన్నారు.

విభజన హామీలు నెరవేర్చండి

- మోడీ పర్యటన సందర్భంగా రెండోరోజు కొనసాగిన నిరసనలు
- ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దీక్ష చేస్తున్న వారిని అరెస్టు చేయడం దారుణం


అనంతపురం జిల్లా గుంతకల్లులో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు


గుంటూరులోని శంకర్ విలాస్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

విభజన హామీలు నెరవేర్చాలని, ప్రత్యేక హోదా ఇవ్వాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రెండోరోజైన శనివారం నిరసనలు కొనసాగాయి. ఉక్కును ప్రైవేటీకరించొద్దని దీక్ష చేస్తున్న వారిని అరెస్టు చేయడం సిగ్గుచేటని పలువురు నాయకులు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా సోంపేటలోని బస్టాండ్ నుంచి గాంధీ మండపం వరకు, కోటబొమ్మాళిలో రైతు బజారు నుంచి కొత్తపేట కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన మోడీ ఏ ముఖం పెట్టుకొని వచ్చారని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం పోరాడుతున్న కార్మికుల శిబిరాన్ని పోలీసులు తొలగించడం సిగ్గుచేటన్నారు. గుంటూరులో శంకర్ విలాస్ సెంటర్ నుంచి లాడ్జీ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన చేశారు. విభజన హామీలు అమలు చేయని మోడీకి రాష్ట్రంలో పర్యటించే నైతిక హక్కు లేదని నినాదాలు చేశారు. మంగళగిరి మండలం కాజ, ఉండవల్లి, పెదనందిపాడులో ఆందోళన చేపట్టారు. పల్నాడు జిల్లా వినుకొండలో శివయ్య స్తూపం వద్ద, సత్తెనపల్లి, నరసరావుపేటలో ధర్నా చేశారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోట దేవి కూడలి వద్ద నల్ల జెండాలతో నిరసన తెలిపారు. లక్కవరపుకోటలోని గాంధీ బొమ్మ జంక్షన్ వద్ద ఆందోళన నిర్వహించి, గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని రేవతి సెంటరు, బంటుమిల్లి లక్ష్మీపురం సెంటరు, గన్నవరంలోని గాంధీబొమ్మ సెంటరు వద్ద ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. మోడీ పర్యటన, కార్మికుల అరెస్టులను నిరసిస్తూ విజయవాడలోని లెనిన్ సెంటరులో నిరసన తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నల్లబ్యాడ్జీలతో ప్రదర్శన చేశారు. కాకినాడ జిల్లాలోని కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం లాకుల వద్ద, తాళ్లరేవులో ధర్నా నిర్వహించారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో ర్యాలీ నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో నల్ల జెండాలతో నిరసన తెలిపారు.


కర్నూలు కలెక్టరేట్ ఎదుట, నంద్యాల గాంధీచౌక్ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతపురం జిల్లా పరిషత్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం, హిందూపురంలోని అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. గుంతకల్లులో నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేశారు. అన్నమయ్య జిల్లా కోడూరులో మహాత్మాగాంధీ సెంటర్ వద్ద, కడప కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. విభజన హామీలు అమలు చేయాలని కేంద్రాన్ని నిలదీయడంలో ముఖ్యమంత్రి విఫలమయ్యారని వామపక్ష నాయకులు విమర్శించారు. దీక్ష చేస్తున్న నాయకులు అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని పాత బస్టాండ్ సెంటర్, టంగుటూరులోని బస్‌స్టాప్ సెంటర్‌లో నిరసన తెలిపారు. విభజన హామీలు నెరవేర్చాలని, పోలవరానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ కాకినాడ కలెక్టరేట్ ఎదుట ఐద్వా, కాంగ్రెస్ నాయకులు ధర్నా చేపట్టారు. దీక్షా శిబిరాన్ని తొలగించడాన్ని నిరసిస్తూ శ్రీకాకుళం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు ధర్నా చేశారు.

ట్విట్టర్ బ్లూ టిక్ నమోదు నిలిపివేత..!

శాన్‌ఫ్రాన్సిస్కో : ట్విట్టర్‌లో చెల్లింపుల సర్వీసు అయినా బ్లూ టిక్ సబ్‌స్క్రిప్షన్‌ను నిలిపివేసినట్లు తెలుస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ట్విటర్ బ్లూటిక్ నమోదు అప్షన్ కనిపించట్లేదని అంతర్జాతీయ ఆంగ్ల మీడియా సంస్థలు రిపోర్టు చేశాయి. ఈ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ వల్ల నకిలీ ఖాతాలు ఎక్కువగా పెరిగిపోవడంతో ఈ సర్వీసును ఆపేసినట్లు సమాచారం. ఈ సర్వీసును పొందాలనుకునే వారికి 8 డాలర్లు ఛార్జ్ చేయాలని ట్విట్టర్ చీఫ్ ఎలన్ మస్క్ ఇటీవల నిర్ణయించిన విషయం తెలిసిందే.

మాస్టర్ ప్లాన్‌కు ససేమిరా..

- రాజధాని 17 గ్రామ సభల్లోనూ చేతులెత్తి వ్యతిరేకత
- బోరుపాలెం సభలో ఒకరు అనుకూలం


తుళ్లూరు గ్రామ సభలో వ్యతిరేకంగా చేతులెత్తిన గ్రామస్తులు

ప్రజాశక్తి - తుళ్లూరు, మంగళగిరి రూరల్

రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్ సవరణలపై ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం నిర్వహించిన 17 గ్రామ సభల్లోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మందడం, లింగాయపాలెంలో శుక్రవారం జరిగిన గ్రామసభల్లో మాస్టర్ ప్లాన్‌లో సవరణలకు అంగీకరించబోమని చెబుతూ గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. రెండవ రోజు శనివారం మిగిలిన 17 గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లోనూ గ్రామస్తుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. రాజధాని అమరావతిని సర్వనాశనం చేసేందుకు పేదలకు ఇళ్ల స్థలాలంటూ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని రాయపూడిలో జరిగిన గ్రామసభలో గ్రామస్తులు కంభంపాటి శిరీష, జానీ, చిలకా విజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం దురుద్దేశంతోనే సిఆర్‌డిఎ సవరణ యాక్ట్ (13) తీసుకొచ్చిందని, రాజధానికి 70- 80 కిలో మీటర్ల దూరంలో ఉన్న వారికి ఇళ్ల స్థలాల పంపిణీకి అనుగుణంగా రెసిడెన్షియల్ జోన్ ఆర్ -5లో మార్పులకు కుట్ర పన్నిందని విమర్శించారు. తుళ్లూరులో జరిగిన గ్రామసభల్లో కాటా అప్పారావు, గద్దె తిరుపతిరావు మాట్లాడుతూ రైతుల భాగస్వామ్యం ఉన్న సిఆర్‌డిఎ చట్టంలో మార్పులు, సవరణలు ప్రభుత్వం ఇష్టారాజ్యంగా చేయాలని చూడడం సరికాదన్నారు. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం, ఉద్దండరాయుని పాలెం, వెంకటపాలెం, మల్కాపురం, వెలగపూడి, నెక్కల్లు, శాఖమూరు, నేలపాడు, రాయపూడి, తుళ్లూరు, ఐనవోలు, అనంతవరం, దొండపాడు, మంగళగిరి మండలం నీరుకొండ, కృష్ణాయపాలెం, కురగల్లు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో మాస్టర్ ప్లాన్‌లో మార్పులకు వ్యతిరేకంగా చేతులెత్తి గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. బోరుపాలెంలో తురకా శ్రీను అనే వ్యక్తి మాస్టర్‌ప్లాన్‌లో సవరణలకు అనుకూలంగా చెయ్యి ఎత్తాడు. గ్రామసభల తీర్మానాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తుళ్లూరు మండల అభివృద్ధి అధికారి ఎ శ్రీనివాసరావు తెలిపారు.

మంత్రి రోజాకు నిరసన సెగ

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

మంత్రి ఆర్‌కె.రోజాకు నిరసన సెగ తగిలింది. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న తిరుపతి జిల్లా నగరి నియోజకవర్గం, వడమాలపేట మండలం పత్తిపుత్తూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.35 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించాల్సి ఉంది. రూ.25 లక్షల పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే సచివాలయాన్ని ప్రారంభించాలని భవనానికి, గేటుకు జెడ్‌పిటిసి సభ్యులు మురళీధర్‌రెడ్డి తాళం వేశారు. మంత్రి అనుచరులు సచివాలయం వద్దకు రాగా మురళీధర్‌రెడ్డి అనుచరులు అడ్డుకున్నారు. అధికారులు మురళీధర్‌రెడ్డితో చర్చలు జరిపారు. ఎంత నచ్చచెప్పిన వినకపోవడంతో మంత్రి అనుచరులు తాళాలు పగులగొట్టారు. దీంతో మురళీధర్‌రెడ్డి అనుచరులు, మంత్రి అనుచరుల మధ్య వాదోపదాలు, తోపులాటలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మురళీధర్‌రెడ్డిని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మంత్రి రోజా సచివాలయాన్ని ప్రారంభించారు.

కూలగొట్టడం, తగలబెట్టడమే వైసిపి రాజకీయం: చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో: కూలగొట్టడం, తగలబెట్టడం వైసిపి సాంప్రదాయ క్షుద్ర రాజకీయమని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. పుంగనూరు, గుంతకల్లులో జరిగిన రెండు ఘటనలు రాష్ట్రంలో వైసిపి రాక్షస రాజకీయానికి నిదర్శనమని శనివారం ఆయన ట్వీట్ చేశారు. పుంగనూరులో టిడిపి కార్యాలయం ఉన్న భవనాన్ని ఖాళీ చేయించడానికి ఎస్‌పి బలగాలతో వెళ్తారా? ఐపిఎస్‌కు మీరు అర్హులేనా? గుంతకల్లులో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చే కేంద్రాన్ని రాజకీయ కక్షతో తగలబెడతారా? అని ప్రశ్నించారు.

ముస్లిములను మభ్యపెడుతున్న జగన్ : టిడిపి

రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని సిఎం జగన్ గుంటూరు సభలో చెప్పడం ముస్లిములను మభ్యపెట్టడమేనని టిడిపి అధికార ప్రతినిధి నసీర్ అహ్మద్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. మైనార్టీ నిరుద్యోగ యువతకు ఒక్క రూపాయి ఆర్థిక సాయం చేసిన దాఖలాలు లేవన్నారు. వైసిపి ఎమ్మెల్యేలు వక్ఫ్ వస్తులను యథేచ్ఛగా దోచుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ మాట్లాడుతూ బడ్జెట్‌లో ముస్లిం మైనార్టీలకు కేటాయించిన నిధుల్లో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. ఆ నిధులనూ, సబ్ ప్లాన్ నిధులనూ దారి మళ్లించారని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్ ఏటా ప్రకటించకపోవడంతో మైనార్టీల్లో నిరుద్యోగం విపరీతంగా పెరిగిందన్నారు. దుల్హన్‌కు పదో తరగతి నిబంధన పెట్టి ఎవరికీ ఈ పథకం అందకుండా కుట్ర చేశారని అన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాల్సిందే..

- అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి


జిఎన్‌టి-3 సదస్సులో మాట్లాడుతున్న బేబిరాణి

ప్రజాశక్తి-గుంటూరు

వివిధ ప్రభుత్వ శాఖలు, పథకాల్లో మహిళా ఉద్యోగులు గణనీయమైన పాత్ర పోషిస్తున్నా కనీస వేతనాలు లేక, పని ప్రదేశాల్లో వివక్షతను ఎదుర్కొంటూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి అన్నారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో గుంటూరులో నిర్వహించనున్న యూనియన్ పదవ రాష్ట్ర మహాసభను పురస్కరించుకొని శనివారం పాత గుంటూరులోని సిఐటియు కార్యాలయలో మహిళా ఉద్యోగుల సదస్సు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్ రమాసుష్మ అధ్యక్షతన జరిగిన సదస్సులో బేబిరాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం పథకంలో లక్షల సంఖ్యలో మహిళలు పనిచేస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారితో వెట్టిచాకిరి చేయించుకుంటున్నాయే తప్ప కనీస వేతనాలు అమలు చేయడంలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో మహిళా ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో కోవిడ్ వారియర్స్‌గా పనిచేశారని, కొందరు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. వారికి ప్రభుత్వం పరిహారం కూడా ఇవ్వలేదన్నారు. మహిళా ఉద్యోగులపై రాజకీయ వేధింపులు నిలువరించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణమే విడుదల చేయాలని, పిఎఫ్, ఇఎస్‌ఐ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. మహాసభ ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల మందికిపైగా అంగన్‌వాడీలు కనీస వేతనాలు లేక ఏళ్ల తరబడి వెట్టి చాకిరీ చేస్తున్నారన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా లేవన్నారు. ఈ నేపథ్యంలో మహిళా ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు ఐక్యంగా ఉండి కనీస వేతనాలు, దాడుల నుంచి రక్షణ కోసం పోరాడాలని కోరారు. సదస్సులో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి, ఎల్‌ఐసి మహిళా ఉద్యోగుల సమన్వయ కమిటీ కో కన్వీనర్ ఎ.ఉషాబాల, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి దీప్తి మనోజ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డి.రమాదేవి

మహిళలకు గరికపాటి క్షమాపణ చెప్పాలి

సుమోటోగా కేసు నమోదు చేయాలని పలు సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళల వస్త్రధారణ, శరీర భాగాలపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన ప్రవచనకారుడు గరికపాటి నరసింహారావు మహిళాలోకానికి క్షమాపణ చెప్పాలని మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. గరికపాటిపై సుమోటోగా కేసు నమోదు చేయాలని, మహిళా కమిషన్ స్పందించాలని అన్నారు. మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.రమాదేవి, ప్రభావతి, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి పి.దుర్గాభవాని, పిఓడబ్ల్యు రాష్ట్ర నాయకులు పద్మ, చైతన్య మహిళా సంఘం నాయకులు రాధ తదితరులు మాట్లాడారు. ఇటీవల కాలంలో గరికపాటి ప్రవచనాల్లో ఆడవాళ్ల దుస్తుల వల్లే అత్యాచారాలు జరుగుతున్నాయని మాట్లాడుతున్నాడని, చిన్న పిల్లలు ఏం దుస్తులు వేసుకున్నారని అత్యాచారాలు చేస్తున్నారో చెప్పాలని అన్నారు. గరికపాటి మహిళలను అవమానించడం మానుకోకపోతే తగిన గుణపాఠం చెబుతా మని హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి మాయావతిని ఏనుగుతో పోల్చడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ఆయనకిచ్చిన పద్మశ్రీని వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనకీ కుటుంబ సభ్యులు ఉన్నారని, వారిని కూడా ఇలాగే విమర్శిస్తారా అని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో ఐద్వా నాయకులు శ్రీదేవి, రమణి, మహిళా సంఘం నాయకులు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు జిల్లా)

మోటారు వాహన చట్టాన్ని ఉల్లంఘించారన్న ఆరోపణలపై జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్‌పై గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఈ నెల ఐదున ఇప్పటం పర్యటన సందర్భంగా పవన్‌కల్యాణ్ కారు డ్రైవర్ ర్యాష్ డ్రైవింగ్‌తోపాటు, పవన్‌కల్యాణ్ కారుపై కూర్చొని ర్యాలీగా వెళ్లడాన్ని తప్పుపడుతూ తెనాలి మారిస్‌పేటకు చెందిన పి.శివకుమార్ అనే వ్యక్తి తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కారుపైన కూర్చొని ప్రయాణించడం చట్టరీత్యా నేరమని, అనుమతి లేకుండా ఆయన ర్యాలీగా వెళ్లారని, ఆయనతోపాటు వాహనాన్ని పలు వాహనాలు అనుసరించడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో, పవన్ కల్యాణ్‌తోపాటు ఆయన డ్రైవరుపై కేసు నమోదు చేశారు. ఈ నెల పదిన పవన్‌పై కేసు నమోదుకాగా పోలీసులు గోప్యంగా ఉంచారు. ఈ విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. సిఐ పి.శేషగిరిరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

2014-19 మధ్యనాటి కేసులపై వివరాలివ్వండి

ఎసిబి డిజికి జిఎడి అధికారుల లేఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అవినీతి నిరోధక శాఖ కేసులపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. ఈ కేసులను త్వరగా పరిష్కరించేందుకు ఇటీవల ఏర్పాటుచేసిన అత్యున్నతస్థాయి కమిటీ తొలి భేటీ నిర్వహించింది. కేసుల లోతును అధ్యయనం చేసేందుకు అవసరమైన వివరాలు సేకరించేందుకు ఎసిబి డైరెక్టర్ జనరల్‌కు లేఖ రాశారు. . దాదాపు 15 అంశాలతో కూడిన నమూనాను కూడా ఎసిబికి పంపించినట్లు తెలిసింది. విధి నిర్వహణలో అవకతవకలపై అనేక మంది అధికారులు, ఉద్యోగులు చాలా సంవత్సరాలుగా అవినీతి నిరోధక శాఖ కేసులను ఎదుర్కొంటున్నారు.

ఏళ్ల తరబడి ఈ కేసులు అపరిష్కృతంగానే ఉండిపోయాయి. కొంతమంది ఉద్యోగులు, అధికారులైతే పదవీ విరమణ కూడా చేసేశారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ కేసులపై సమీక్ష జరిగి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, ఆ ప్రక్రియ అమలు జరగడం లేదు. ఈ నేపథ్యంలోనే ఒక కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా కేసుల పరిష్కారానికి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఎసిబి డిజికి పంపించిన లేఖలో పొందు పరిచిన నమూనా ద్వారా మొత్తం వివరాలు సేకరిస్తున్నారు. కేసులో ఇరుకున్న ఉద్యోగి పేరు, కేసు కోణం, ఎఫ్‌ఐఆర్ నంబర్, సంక్షిప్తంగా కేసు వివరాలు, కేసు ప్రస్తుత పరిస్థితి, నిందితులకు ఇచ్చిన నోటీసు, వచ్చిన రిప్లై వివరాలు, కేసుపై ఎసిబి సిఫార్సులతోపాటు, ఉద్యోగి పనిచేస్తున్న శాఖ, విజిలెన్స్ కమిషన్ సిఫార్సులను కూడా సమర్పించాలని ఎసిబి డిజిని కమిటీ కోరింది.

పోలవరం నిర్వాసితులను ఆదుకోండి

- ఆరో రోజూ కొనసాగిన చేరిన రిలే దీక్షలు


సమస్యలు పరిష్కరించాలని దీక్షలు చేస్తున్న నిర్వాసితులు

ప్రజాశక్తి - కుక్కునూరు (పశ్చిమగోదావరి జిల్లా)

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన తమను ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పశ్చిమగోదావరి జిల్లా కుక్కనూరులో నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారంనాటికి ఆరో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా నిర్వాసితుల సంఘం జిల్లా నాయకులు ఎర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ.. ప్రాజెక్టు నిర్మాణంపై ఉన్న శ్రద్ధ నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల్లో ప్రభుత్వాలకు లేకపోవడం శోచనీయమన్నారు. సమస్యలు పరిష్కరించాలని గత ఆరు రోజులుగా రిలే దీక్షలు చేస్తోన్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని తెలిపారు. మాధవరం, కౌండిన్యముక్తి, యల్లప్పగూడెం, బెస్తగూడెం గ్రామాలను 41.15 కాంటూర్‌లో చేర్చాలని, గోదావరి వరదల వల్ల దెబ్బతిన్న ఇళ్లకు నష్ట పరిహారం చెల్లించాలని, వరదల వలన పూర్తిగా పాడైన వెంకటాపురం నుండి లంకాలపల్లి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇచ్చేవరకు దీక్షలు విరమించేది లేదని స్పష్టం చేశారు. దీక్షల్లో నిర్వాసితుల సంఘం నాయకులు వాదం రమణ, ఈశ్వరి, నిర్మల భద్రకాళి, బొల్లి రమాదేవి పాల్గొన్నారు.

సంపాదకీయం


పెళ్లి సందడి

'పెళ్ళంటె పందిళ్ళు.. సందళ్ళు/ తప్పెట్లు.. తాళాలు తలంబ్రాలూ/ మూడే ముళ్ళు.. ఏడే అడుగులు/ మొత్తం కలిసీ నూరేళ్ళు' అంటాడో సినీకవి. తాటాకులతో పందిరి వెయ్యాలి. మామిడాకులతో తోరణాలు కట్టాలి. అరటి ఆకుల్లో భోజనాలు పెట్టాలి. అదీ పెళ్లంటే అన్నది మరో సినిమాలో డైలాగ్. గతంలో పెళ్లిళ్ల ఇలాగే జరిగేవి. గడచిన పదేళ్లలో ఈ పెళ్లి కాన్సెప్ట్ మారిపోయింది. హంగూ ఆర్భాటాలకు పెళ్లిళ్ల వేదిక అవుతున్నాయి. నిశ్చయ తాంబూలాలు, ప్రీవెడ్డింగ్ వీడియో షూట్లు, ఆర్భాటంగా మండపాలు కట్టడం, మెహందీ, సంగీత్, దావత్‌లతో హడావుడి చేయడం ఒక ట్రెండ్‌గా మారింది. ఇప్పుడు పెళ్లిళ్ల ఇంటి ముందు వేసే తాటాకుల పందిళ్ల నుంచి ఫంక్షన్ హాళ్లకు మారాయి. ఆకాశమంత పందిరేమో గానీ, చుక్కలన్నీ వరుసకట్టి నేలమీదకొచ్చినట్లుగా విద్యుద్దీపాలు, డీజె మోతలతో అట్టహాసంగా కనిపించేవి. ఈ మధ్య పెద్దపెద్ద పెళ్లిళ్లన్నీ... ఫంక్షన్ హాళ్ల నుంచి రిసార్ట్స్‌కి, హోటళ్లకి మారిపోతున్నాయి. కట్నకానుకల సంస్కృతి కూడా విషవృక్షంలా వేళ్లూనుకొని పోయింది. పెళ్లంటే రెండు జీవితాలను ముడివేసే బంధం. జీవితంలో అదొక అద్భుత సందర్భం. కాబట్టి ఆ సందర్భాన్ని సంతోషంగా జరుపుకోవాలి.


'స్వతంత్ర దేశంలో చావు కూడా పెళ్లిలాంటిదే బ్రదర్' అంటాడు ఆచార్య ఆత్రేయ. పెళ్ళిళ్లకైతే... ఇక ఆ వైభవాన్ని మాటల్లో చెప్పలేం. ఇప్పుడంతా మ్యారేజ్ కంట్రాక్టర్లు, ఈవెంట్ మేనేజర్లదే హవా. ఇల్లు మనం చూపిస్తే... షామియానా వాళ్లేస్తారు. బిల్లు మనం కడితే... వంటలు వాళ్ల చేస్తారు. పెళ్లివారిని మనం చూపిస్తే... మర్యాదలు వాళ్ల చేస్తారు. ముహూర్తం మనం చెబితే... ముత్తైదువులను వాళ్ల సప్లయ్ చేస్తారు. పెళ్లివారు చేయాల్సిందల్లా పట్టుబట్టలు కట్టుకొని ఫొటోలకు ఫోజులివ్వడమే. పెళ్లి అంటే రెండు కుటుంబాల్లో జరిగే ఒక వేడుక. మరికొంత మందికి ఇదొక వ్యాపారం. తగ్గేదేలే అన్నట్టుగా సామాన్యుల నుంచి... మధ్య తరగతి ప్రజల వరకు పెళ్ళికి భారీగా ఖర్చు పెడుతున్నారు. పెళ్లి తర్వాత అప్పుల పాలవుతున్నారు. తాజాగా పెళ్లిళ్లకు సంబంధించి ఆసక్తికర లెక్కలు బయటికొచ్చాయి. నవంబర్ 4 నుంచి డిసెంబర్ 14 వరకు దేశ వ్యాప్తంగా 32లక్షల వివాహాలు జరగనున్నట్టు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సిఎఐటి) అంచనా వేసింది. ఇక ఈ పెళ్లిళ్లకయ్యే ఖర్చు... అక్షరాలా రూ.3.75 లక్షల కోట్లని అంచనా. గతేడాది ఇదే సీజన్‌లో దేశంలో 25లక్షల పెళ్లిళ్లు జరగ్గా.. రూ.3లక్షల కోట్లు మేర వ్యాపారం జరిగిందట. స్త్రీ పురుషులిద్దరు, వారి బంధు మిత్రులతో జరుపుకోవలసిన పెళ్లి... ఇప్పుడు కార్పొరేట్ వ్యవహారంగా మారిపోవడం నేటి వైచిత్రి. నయా ఉదారవాద ఆర్థిక విధానాలు వచ్చాక, పెరిగిన వినిమయతత్వం గొప్పలకు పోయే ధోరణిని పెంచింది. అది వ్యాపారులకు వరంగా మారగా, చాలా కుటుంబాలకు అప్పులను మిగుల్చుతోంది. పెళ్లిళ్లలో దేనికి ఎంత ఖర్చు అవుతున్నదనే విషయంపై కూడా సిఎఐటి అంచనా వేసింది. 20 శాతం ఖర్చు పెళ్లి కొడుకు పెళ్లి కూతురుకు అయితే, మిగతా 80 శాతం ఖర్చు పెళ్లి నిర్వహణకే అవుతోందని అంచనా.

పెళ్లి సందడి జీవితంలో మధురమైన జ్ఞాపకంగా వుండాలి. అంతేగానీ అవసరానికి మించిన ఆడంబరాలకు ఖర్చుచేసి, ఎలా తీర్చాలా అని మథనపడే పరిస్థితి వుండ కూడదు. జీవితంలోని సంతోషకరమైన ఆ క్షణాలు... ఒక చేదు జ్ఞాపకంగా మిగిలిపోకూడదు. అందుకే.. వున్నదాంట్లో సంతృప్తిపడాలి. ఎంతవరకు ఖర్చు పెట్టగలమో ఆలోచించుకోవాలి. ఒక్కరోజు ఆర్భాటం కోసం ఉన్నదంతా ఊడ్చిపెట్టేస్తే... ఆ జంటకు, లేదా ఆయా కుటుంబాలకు తర్వాత మిగిలేది అప్పుల చిట్టా మాత్రమే. పెళ్లికి కావాల్సింది... ఒకరికోసం ఒకరు బతకాలనుకునే ఇద్దరు వ్యక్తులు, వారి సంతోషాన్ని పంచుకోడానికి వచ్చే కొద్దిమంది బంధుమిత్రులు చాలు. 'పెళ్లంటే ఇద్దరు వ్యక్తుల వ్యవహారం. ఇద్దరు సాక్షులూ, రిజిస్ట్రారు అవసరం' అంటాడు చాసో. కేవలం రూ.500 ఖర్చుతో పెళ్లి చేసుకొని ఆదర్శంగా నిలిచిన వారున్నారు. రూ.500 కోట్లు ఖర్చు పెట్టి ఆడంబరంగా చేసుకున్న వారూ వున్నారు. పెళ్లి పేరుతో ఆడంబరాలకు పోయి, తాహతుకు మించి ఖర్చు చేయకుండా... తాటాకు పందిట్లోనైనా ఆహ్లాదకరంగా జరుపుకుంటే... ఆ పెళ్లి సందడి జీవితాంతం ఒక మధురమైన జ్ఞాపకంగా వుంటుంది.

మహనీయుల మాట



ఒక విషయాన్ని ఇతరులకు
సులభంగా అర్థమయ్యేలా
వివరించలేకపోవడమంటే...
నీకే ఆ విషయం పూర్తిగా
అర్థం కానట్లు లెక్క.
- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్



ఉత్తుత్తి ప్రసంగాలు.. కుటిల రాజకీయాలు..

ప్రస్తుతం



తెలకపల్లి రవి

ఎ.పి, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రధాని నరేంద్ర మోడీ అధికార పర్యటన బిజెపికి అనధికార ప్రచార యాత్రగా పరిణమించింది. ఎ.పి లో వైఎస్‌ఆర్‌సిపి ఆయనకు బ్రహ్మరథం పడితే...తెలంగాణలో టిఆర్ఎస్, వామపక్షాల నిరసనతో అచ్చమైన బిజెపి యాత్రగానే మారింది. ఏ రోటి దగ్గర ఆ పాట లాగా సెంటిమెంటు అస్త్రంతో ఇక్కడ ఆంధ్రుల గొప్పతనాన్ని అక్కడ తెలంగాణ ప్రజల వారసత్వాన్ని పొగిడేసి మెప్పించే ప్రయత్నం చేశారు. తన సభ కోసం బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేసి జన సమీకరణ భారం కూడా మోసిన జగన్ సర్కారు జోలికి పోకుండా అక్కడ తన ప్రభుత్వ ఘనతలు చాటుకోవడంతో సరిపెట్టారు. అదే తెలంగాణకు వచ్చేసరికి...అడుగు పెట్టినప్పటి నుంచి ఆఖరి వరకూ రాష్ట్ర ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రిపైనా దాడులకే పరిమితమయ్యారు. ఆపరేషన్ ఫామ్‌హౌస్ అరెస్టులు, మునుగోడు ఎదురుదెబ్బతో గుండె చెదిరిన రాష్ట్ర బిజెపి నేతలకు భరోసా ఇవ్వడానికి తంటాలు పడ్డారు. విశాఖలో ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యోగ కార్మికుల అరెస్టుల మధ్య వేదికపై ముఖ్యమంత్రి జగన్ చేసిన విజ్ఞప్తిపై స్పందించలేదు గాని...తెలంగాణలో సింగరేణి గనుల ప్రైవేటీకరణపై దుష్ప్రచారం జరుగుతున్నదంటూ హడావుడి చేశారు. మొత్తం పైన చూస్తే రెండు తెలుగు రాష్ట్రాలలో పరస్పర విరుద్ధ పోకడలు కనిపించినా సారాంశం మాత్రం బిజెపి ప్రయోజనాలు, రాజకీయ ఎత్తుడగలు, గొప్పలు చెప్పుకోవడంగానే పరిణమించింది. ఆంధ్రప్రదేశ్‌లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పాత్ర అదనంగా తోడైంది. ఈ ఘట్టంలో ఆయనను ముందుకు తెచ్చిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తాను తెలంగాణలో తమ పార్టీ పునరుజ్జీవనంపై కేంద్రీకరించానంటూ మొహం చాటేశారు. రెండు చోట్ల వామపక్షాలు మాత్రం మోడీ విధానాలకు రాష్ట్రాల పట్ల ఆయన సర్కారు నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఉద్యమించారు.





> ఏ రోటి దగ్గర ఆ పాట లాగా సెంటిమెంటు అస్త్రంతో ఇక్కడ ఆంధ్రుల గొప్పతనాన్ని అక్కడ తెలంగాణ ప్రజల వారసత్వాన్ని పొగిడేసి మెప్పించే ప్రయత్నం చేశారు. తన సభ కోసం బ్రహ్మాండమైన ఏర్పాట్లు చేసి జన సమీకరణ భారం కూడా మోసిన జగన్ సర్కారు జోలికి పోకుండా అక్కడ తన ప్రభుత్వ ఘనతలు చాటుకోవడంతో సరిపెట్టారు. అదే తెలంగాణకు వచ్చేసరికి ...అడుగు పెట్టినప్పటి నుంచి ఆఖరి వరకూ రాష్ట్ర ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రిపైనా దాడులకే పరిమితమయ్యారు. ఆపరేషన్ ఫామ్‌హౌస్ అరెస్టులు, మునుగోడు ఎదురుదెబ్బతో గుండె చెదిరిన రాష్ట్ర బిజెపి నేతలకు భరోసా ఇవ్వడానికి తంటాలు పడ్డారు. విశాఖలో ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యోగ, కార్మికుల అరెస్టుల మధ్య వేదికపై ముఖ్యమంత్రి జగన్ చేసిన విజ్ఞప్తిపై స్పందించలేదు గాని... తెలంగాణలో సింగరేణి గనుల ప్రైవేటీకరణపై దుష్ప్రచారం జరుగుతున్నదంటూ హడావుడి చేశారు. మొత్తంపైన చూస్తే రెండు తెలుగు రాష్ట్రాలలో పరస్పర విరుద్ధ పోకడలు కనిపించినా సారాంశం మాత్రం బిజెపి ప్రయోజనాలు, రాజకీయ ఎత్తుడగలు, గొప్పలు చెప్పుకోవడంగానే పరిణమించింది.

ఎ.పి లో విన్యాసాలు

ముందుగా ఎ.పి సంగతి తీసుకుంటే ఈ సమయంలో మోడీ పర్యటన జగన్ సర్కారు విశాఖ రాజకీయాలకు సానుకూల సంకేతాలు ఇస్తుందనే అభిప్రాయం బలంగా వచ్చింది. మూడు రాజధానుల పేరిట సాగుతున్న ప్రహసనంలో ఈ నగరం కేంద్ర బిందువుగా వుంది. ఇటీవల పాలక పార్టీ ప్రేరణతో జరిగిన విశాఖ గర్జన, పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంలో తీవ్ర ఉద్రిక్తత చూశాం. జనసేన వారు మంత్రులపై దాడి చేయడం, ఆయన పర్యటన పట్ల పోలీసుల ప్రతికూలత తర్వాత ఆయన చెప్పు చూపిస్తూ ప్రసంగం చేయడం, చంద్రబాబు సంఘీభావంతో ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమమంటూ ప్రకటించడం జరిగాయి. పోలీసుల వైఖరి, ప్రభుత్వం ప్రతిపక్షాల కార్యక్రమాలను అడ్డుకోవడం సరికాదంటూనే బిజెపిని వ్యతిరేకించకుండా వీరు ఎలా ప్రజాస్వామ్య పునరుద్ధరణ చేయగలరనేది సహేతుకమైన ప్రశ్న. తెలుగుదేశం, జనసేన కలసి పోవడమే గాక బిజెపితో కూడా కూటమి ఏర్పాటు చేస్తాయని కథలు వినిపించాయి. బిజెపి, టిడిపితో సంబంధం వుండబోదని పవన్ మాత్రం తమతో వుంటాడని ఒకటికి రెండు సార్లు ప్రకటించింది. జగన్ కేంద్రంపై విమర్శలు చేయకుండా విధేయత ప్రదర్శిస్తున్న నేపథ్యం వుండనేవున్నా రాజకీయంగా వంటరిగానే వుంటామని వైసిపి చెబుతూ వస్తున్నది. ఎ.పి రాజకీయంలో మూడు ప్రాంతీయ పార్టీలు తమలో తాము తిట్టుకుంటూ బిజెపికి మార్గం సుగమం చేస్తున్నాయనేది స్పష్టమైపోయింది. రాష్ట్రం కోసం కలసి కట్టుగా కేంద్రంపై పోరాడటమనే ప్రసక్తి లేకుండా పోయింది.

బాబు అదృశ్యం, పవన్ ఆశాభంగం

విశాఖ ఘటనల తర్వాత గుంటూరు జిల్లా ఇప్పటం గ్రామంలో ఘటనలు వేడిని మరింత పెంచాయి. పలు కేసులూ అసహన వివాదాలు కూడా నడుస్తున్నాయి. టిడిపి, జనసేన మధ్య సంబంధాలే గాక బిజెపి వాటిలో ఎవరితో వుంది లేదు అనే తర్జనభర్జనలూ పెరిగాయి. ఎందుకంటే ఆ రెండు పార్టీలూ జగన్ ప్రభుత్వ తప్పిదాలనే విమర్శిస్తూ కేంద్రం పోకడల గురించి రాష్ట్రాలపై దాడి గురించి మాట్లాడటమే మానేశాయి. పైగా అదంతా రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతేనంటూ వాదిస్తున్నాయి. రామతీర్థం వంటి వివాదాలను పెంచడంలో బిజెపికి తీసిపోని విధంగా వ్యవహరించాయి. ఆ బిజెపి రోడ్ మ్యాప్ కోసం చూస్తే రాలేదు గనక తన వ్యూహం మార్చుకోవలసి రావచ్చని పవన్ అన్నారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలిపోకుండా అన్ని పార్టీలనూ ఒక తాటిపైకి తెస్తానని పవన్ అంటుంటే చంద్రబాబు బిజెపి తమకు దగ్గరవుతున్నదనే కథనాలు ప్రచారంలో పెట్టారు. బిజెపి అధినేతలు జనసేనకే తమ పొత్తు పరిమితమని స్పష్టం చేస్తూ వచ్చారు. అమరావతి రాజధానిగా వుండాలనేది తమ విధానమని రాష్ట్రంలో బిజెపి నేతలతో చెప్పిస్తూనే కేంద్రం నుంచి, అత్యున్నత నాయకత్వం నుంచి ఆ సూచనలు రాకుండా జాగ్రత్త పడ్డారు. ఇవన్నీ బిజెపి ద్వంద్వ రాజకీయాలను, కపట నీతిని తెలియజెప్పే ఉదాహరణలు. అయినా మోడీపై బిజెపిపై ఎనలేని గౌరవం ప్రకటించిన పవన్ కళ్యాణ్‌తో బంధం అట్టిపెట్టుకోవడానికి కూడా నాయకత్వం ఈ పర్యటనను అవకాశంగా చేసుకోవడంలో ఆశ్చర్యం లేదు (చంద్రబాబు ఈ తేదీలలోనే తన తెలంగాణ యాత్ర పెట్టుకున్నారు). ఆఖరి నిముషంలో మొక్కుబడిగా పవన్‌తో భేటీని పిఎంవో ఖరారు చేస్తే అదేదో మహత్తర ఘటనగా మీడియాలు కొన్ని ప్రచారం చేశాయి. పవన్‌నే ముఖ్యమంత్రిగా ప్రకటించి టిడిపి వైపు వెళ్లకుండా ఆపుతారని ఊహాగానాలు నడిచాయి. రాష్ట్ర ప్రభుత్వంపై అయిదు పేజీల నోట్ తయారు చేసుకుని వెళ్లిన జనసేనాని మోడీకి దాన్ని సమర్పించడం తప్ప పెద్దగా మాట్లాడినట్టు లేదు. స్పష్టత అంతకన్నా లేదు. 'రాష్ట్రానికి, తెలుగు వారికి మంచి రోజులు వస్తాయని' సినిమా పాట తరహాలో డైలాగు చెప్పి ఆయన వెళ్లిపోయారు. దాంతో ఇదంతా ప్రచారకాండేనని తేలిపోయింది. విశాఖ ఉక్కుపై జగన్ ను పదేపదే ప్రశ్నించిన పవన్ తాను ఆ ముక్కయినా ప్రస్తావించినట్టు ఇప్పటి వరకూ చెప్పలేదు. మొదట భారీ కథలతో చెలరేగి తర్వాత హతాశులైన మీడియా వెంటనే పవన్ ఇచ్చిన పత్రాల ఆధారంగా జగన్‌పై చర్యలు తప్పవని కొత్త పల్లవి మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వ తప్పిదాలపై, శాంతి భద్రతల వైఫల్యంపై కేంద్రం జోక్యం చేసుకోవాలని పదేపదే కోరడం రాజ్యాంగ విరుద్ధమే గాక బిజెపికి పెత్తనమిచ్చే వైఖరి.

మోడీకి జగన్ బహిరంగ సంకేతాలు

ఇక శనివారం బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ ప్రసంగంలో కవితలు, పాటల ఆధారంగా రాజధాని తరలి వస్తుందనే సంకేతాలు వదిలారు. తాము గతంలో ఇచ్చిన విజ్ఞప్తులు నెరవేర్చాలని కోరుతూ విశాఖ ఉక్కు, పోలవరం ప్రత్యేక హోదా వంటివి (తెలుగులో) ప్రస్తావించారు. రాష్ట్ర ప్రయోజనాలు తప్ప ఇతర రాజకీయాలు తమకు అవసరం లేదంటూ మోడీతో ప్రత్యేక అనుబంధం నొక్కి చెప్పి జగన్ నమోనమ: అంటూ రెండు చేతులూ జోడించేశారు. పూర్తి కాని అంశాలు ఇన్ని వున్నాయంటున్న జగన్...ప్రత్యేక ప్రేమతో మోడీ ఎ.పి కి అన్నీ ఇచ్చేస్తున్నారని పొగడ్డం మరో విపరీతం. మోడీ మాత్రం ఆయన కోరిన వాటిపై పెదవి మెదపలేదు. దేశాన్ని తామెంత గొప్పగా పాలిస్తున్నామో, తెలుగువారెంత గొప్పవారో పొగిడి మురిపించేందుకు ప్రయత్నించారు. విశాఖ పట్టణం విశేష పట్టణం అంటూ సర్కారుకు సానుకూలత చూపించారు. విశాఖను చూస్తే వెంకయ్య నాయుడు, హరిబాబు గుర్తుకు వస్తారని తమ పార్టీ నేతలనే ప్రస్తావించారు తప్ప ఆఖరుకు తెన్నేటి విశ్వనాథం వంటివారినైనా తలవలేదు. పవన్ చెప్పినట్టు మంచి రోజులను సూచించే ప్రకటన ఒకట్టైనా చేయకుండానే హైదరాబాద్ బయిలుదేరారు.

కెసిఆర్‌పై యుద్ధ ప్రకటనే!

హైదరాబాద్‌లో దిగగానే మోడీ డబల్ ఫోటో మొదలైంది. తనను స్వాగతించేందుకు కెసిఆర్ రాలేదు గాని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. బేగంపేట విమానాశ్రయం దగ్గరే తొలి ప్రసంగంతోనే కెసిఆర్ సర్కారుపై యుద్ధ ప్రకటన చేశారు. నిజాం సర్కారు లాంటి ఈ ప్రభుత్వానికి మర్యాద లేదన్నారు. తనను తిట్టినా పర్వాలేదు గాని తెలంగాణ ప్రజలను అవమానిస్తే సహించేది లేదని హూంకరించారు. గవర్నర్‌ను అవమానించారన్నారు. ప్రజలను దోచుకుంటున్న ప్రభుత్వ అవినీతిని అంతం చేయకుండా వదిలేది లేదన్నారు. తెలంగాణలో బిజెపి నేతలకు ఇప్పటి చీకట్లు తొలగిపోయి కొత్త వెలుగులు వచ్చేస్తాయని, చీకట్ల మధ్యనే కమలం వికసిస్తుందని ఓదారుస్తూ ఆపరేషన్ ఫాం హౌస్ దెబ్బలకు మందు పూసే ప్రయత్నం చేశారు. మునుగోడులో తమ వాళ్లు బాగా పోరాడారంటూ పొగిడారు. ఓడిపోయిన రాజగోపాల్ రెడ్డి వెన్ను తట్టి మరీ భరోసా ఇచ్చారు. సింగరేణి కాలరీస్‌ను ప్రైవేటీకరిస్తామనేది దుష్ప్రచారమనీ, 51 శాతం వాటావున్న రాష్ట్రానికి తెలియకుండా తామేమీ చేయలేమని పదేపదే చెప్పారు. ఆయనతో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా సింగరేణిపై గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని చెలరేగిపోయారు. తమాషా ఏమంటే బ్రహ్మాండమైన ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై నోరు మెదపని ప్రధాని తెలంగాణలో అదేపనిగా ఆ సంగతి మాట్లాడ్డం.

రామగుండం కర్మాగారం కూడా ఏదాది కిందనుంచి పనిచేస్తూ బాగా లాభాలు ఆర్జించిన విషయం రాష్ట్ర ప్రభుత్వం లెక్కలతో సహా విడుదల చేసింది. ఇక మర్యాదల విషయానికి వస్తే అందులో రాష్ట్ర ప్రభుత్వానికి 11 శాతం వాటా వున్నా ముఖ్యమంత్రిని ప్రధాని కార్యాలయం సంప్రదించకుండా ఆ శాఖా మంత్రి సమాచారం మాత్రమే పంపడంలో కేంద్రం మర్యాదేంటో తెలుస్తుంది. నిజానికి రెండు రాష్ట్రాలలోనూ అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవాలు అంటూ ఊదరగొట్టడమే గాని వాస్తవంలో మూడో వంతు మాత్రమే పూర్తయిన పనులు. అది కూడా ఇప్పుడు కాదు, ఎప్పుడో! వీటిపై వదిలిన టీవీ యాడ్ ప్యాకేజీలలోనే ఈ సంగతి మనకు స్పష్టమవుతుంది. వీటితోనే ఏదో మహత్త రమైన మేలు జరిగిపోతున్నట్టు ఆర్భాటం చేయడం అర్థ రహితం. మరింత గట్టిగా పోరాడటమే అత్యవసరం. తెలుగు రాష్ట్రాలకూ దేశానికి కూడా అదొక్కటే మిగిలిన మార్గం.

★

సందర్భం

మధుమేహం - నివారణ



డా॥ ఎం.వి.రమణయ్య

వయసుతో సంబంధం లేకుండా కోట్లాది మందిని ఇబ్బంది పెడుతున్న వ్యాధి మధుమేహం. ఒకసారి ఈ వ్యాధి వస్తే జీవితాంతం భరించాల్సిందే అన్న చేదు వాస్తవం చాటునే చక్కని పరిష్కారం సైతం ఉంది అన్న తీపి వాస్తవాన్ని కూడా గమనించాలి. మెరుగైన జీవనం, క్రమబద్ధమైన ఆరోగ్య సూత్రాలను పాటిస్తే.. జీవితాన్ని ఆరోగ్యమయంగా మార్చుకో వచ్చనేది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. మధుమేహ నియంత్రణ కోసం 1991 నుంచి ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం నవంబరు 14న 'డయాబెటిస్ డే' జరుపుకుంటున్నాం. కానీ మధుమేహం రోగుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంది. ప్రపంచంలో ప్రాణాలు తీస్తున్న ప్రమాదకర వ్యాధుల జాబితాలో మధుమేహ వ్యాధి తొమ్మిదవ స్థానంలో వుంది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 14.2 కోట్ల మంది మధుమేహ రోగులతో చైనా మొదటి స్థానంలో ఉంది. 7.7 కోట్ల మంది రోగులతో భారతదేశం రెండో స్థానంలో ఉంది. ఈ లెక్కల ప్రకారం భారతదేశ జనాభాలో ప్రతి 11వ వ్యక్తికి మధుమేహం ఉంది. ఈ సంఖ్యలను చూస్తే మధుమేహ వ్యాధి ఎంత తీవ్రంగా ఉందో అర్థం అవుతుంది. సమస్య అంతకంతకూ పెరుగుతోంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 42.2 కోట్ల మందికి మధుమేహం ఉందని...నాలుగు దశాబ్దాల కిందటితో పోలిస్తే ఈ సంఖ్య నాలుగు రెట్లకు పైగా పెరిగిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) అంచనా.

ఈ వ్యాధి వల్ల శరీరంలోని ప్రతి అవయవం ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్నా కూడా...మధుమేహ బాధితుల్లో సగం మందికి తమకు ఆ వ్యాధి ఉందన్న సంగతే తెలియదు. ఉందని గుర్తించిన తర్వాత కూడా తగిన జాగ్రత్తలు తీసుకోక బాధపడుతున్న పరిస్థితి. దీనిని నివారించడానికి మన ముందు రెండు మంచి మార్గాలు ఉన్నాయి. ఎవరికి మధుమేహ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉందో తెలుసుకొని జాగ్రత్త పడడం మొదటిది. మధుమేహ వ్యాధి లక్షణాలు కనిపించక ముందే గుర్తించడం రెండవది. మధుమేహం రావడానికి ప్రధాన కారణం వంశపారంపర్య చరిత్ర అని ఎక్కువ మంది అనుకుంటారు. ఇది వాస్తవం కాదు. ఆరు శాతం మందికి మాత్రమే వంశపారంపర్య కారణం ఉంటుంది. షుగర్ రావడానికి ప్రధానమైన కారణం అధిక బరువు. దీనితోపాటు శారీరక శ్రమ తక్కువగా ఉండడం. మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉండడం. నిద్ర లేమి వంటి కారణాలు కూడా మధుమేహ వ్యాధికి దారి తీయవచ్చు.



నవంబర్ 14 వరల్డ్ డయాబెటిస్ డే

శారీరక శ్రమ తగ్గిపోయి, మానసిక ఒత్తిడి పెరిగిపోతూ అధిక బరువుకి దారితీస్తున్నది. టీవీలు, సెల్ ఫోన్లు సన్నబడుతున్నాయి. మనుషులు లావు అవుతున్నారు. లావు కావడమే షుగర్ వ్యాధి పెరగడానికి ప్రధాన కారణం అయింది. టెక్నాలజీని ఉపయోగించుకుంటూనే ఆహార నియమాలు పాటిస్తూ రోజూ కనీసం 30 నిమిషాల పాటైనా వ్యాయామం చేయగలిగితే షుగర్ వ్యాధి రాకుండా కట్టడి చేయవచ్చు. షుగర్ వ్యాధిని డాక్టర్లు ఈరోజు గుర్తించారు అంటే...అది ఈ రోజే వచ్చిన జబ్బు కాదు. దరిదాపుగా ఐదు నుంచి పది సంవత్సరాల క్రితమే ప్రారంభమై ఉంటుంది. మొదట్లో వ్యాధి లక్షణాలు కనిపించవు. క్రమంగా వ్యాధి మొదలై, లక్షణాలు వస్తాయి. ఈ దశనే వైద్య పరిభాషలో ప్రీ డయాబెటిస్ అంటారు. ప్రీ డయాబెటిస్ దశలో వ్యాధిని గుర్తించగలిగితే దాదాపు సగం మందికి వారి జీవితంలో ఈ వ్యాధి రాకుండా చూసుకోవచ్చు. మిగిలిన సగం మందికి ఐదు నుంచి పది సంవత్సరాల పాటు వ్యాధిని వెనకకు నెట్టవచ్చు. 45 సంవత్సరాలు పైబడిన వారందరూ మూడు సంవత్సరాలకు ఒకసారి ఉదయం పరగడుపున రక్త పరీక్ష చేయించుకుని షుగర్ మోతాదును చూసుకోవాలి. దీనిని ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ అంటారు. ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ 100 మిల్లీ గ్రాముల లోపు ఉంటే షుగర్ వ్యాధి లేనట్టు. వంద నుంచి 139 మిల్లీ గ్రాముల లోపు ఉంటే ప్రీ డయాబెటిస్ దశలో ఉన్నట్టు. 140 మిల్లీ గ్రాములకు మించి ఉంటే డయాబెటిస్ వ్యాధి ఉన్నట్టు. ప్రీ డయాబెటిస్ దశలో ఉన్నవారు సంవత్సరానికి ఒక్కసారి షుగర్ మోతాదును పరీక్షించుకోగలిగితే షుగర్ వ్యాధిని ముందుగా గుర్తించవచ్చు. తగిన వైద్యం చేయించుకుంటే షుగర్ వ్యాధి వల్ల వచ్చే అనేక అనర్థాలను అదుపు చేయవచ్చు.

మనిషి వ్యాధి నిరోధక శక్తిని బట్టి మధుమేహ వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. తరచూ మూత్రం రావడం, దాహం ఎక్కువగా వేయడం. గొంతు ఎండిపోతున్నట్లు అనిపించడం, అకారణంగా బరువు తగ్గడం, బాగా నీరసంగా ఉండడం. చూపు మందగించడం, అతిగా ఆకలి వేయడం, కాళ్లలో స్పర్శ తగ్గడం, వృషణాలలో దురద, అంగంలో మంటగా ఉండటం... లాంటి లక్షణాలు కనిపిస్తే తప్పక రక్తంలో షుగర్ మోతాదును పరీక్ష చేయించుకోగలిగితే షుగర్ వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించవచ్చు. ఈ లక్షణాలన్నీ అందరిలో ఉండకపోవచ్చు. కొద్దిమందిలో కొన్ని కనిపిస్తాయి. మరికొందరిలో మరికొన్ని కనిపిస్తాయి. ఈ లక్షణాలు ఉన్న వారందరూ తప్పక షుగర్ పరీక్ష చేయించుకోవాలి. వ్యాధి ముదిరి రక్త నాళాలు, మూత్రపిండాలు, గుండె సమస్యలు వచ్చిన తర్వాతే ఎక్కువ మంది గుర్తిస్తారు. రక్తంలో చక్కెర స్థాయి అధిక స్థాయిలో ఉంటే.. అది రక్త నాళాలను తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. శరీరంలో రక్తం సక్రమంగా ప్రవహించలేకపోతే రక్తం అవసరమైన శరీర భాగాలకు అది చేరదు. దానివల్ల నాడీ వ్యవస్థ దెబ్బతినటం, చూపు కోల్పోవటం, కాళ్లకు ఇన్ఫెక్షన్లు వంటి ప్రమాదాలు పెరుగుతాయి.

మధుమేహం వ్యాధి బారిన పడకూడదంటే...ఆరోగ్య వంతమైన ఆహారం తీసుకుంటూ మంచి అలవాట్లతో జీవనశైలిని పాటించాలి. మధుమేహాన్ని నివారించడానికి కొన్ని పద్ధతులు ఉన్నాయి. ఇలాంటి చిన్న మార్పులు కూడా చాలా పెద్ద ప్రభావం చూపుతాయి. తీపిగా ఉండే మిఠాయిలు, చక్కెర పానీయాల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువగా ఉంటుంది. రోజూ ఆర్టిఫీషియల్ షుగర్ డ్రింక్స్ లేదా కూల్ డ్రింక్స్ తాగే వ్యక్తులకు టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం 80 శాతం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి పానీయాలకు ప్రత్యామ్నాయంగా తాజా పండ్ల రసం, టీ, కాఫీ లేదా నిమ్మరసం, కొబ్బరి నీరు వంటివి తీసుకోవచ్చు.

ప్రతి ఒక్కరూ శరీర బరువు పెరగకుండా శ్రద్ధపెట్టాలి. ఎందుకంటే అధిక బరువు మధుమేహానికి ప్రధాన కారణం. అదనపు బరువును తగ్గించే ప్రతి ప్రయత్నం డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, శరీర బరువులో 7 శాతం వరకు తగ్గడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం 60 శాతం వరకు తగ్గుతుందని ఒక పరిశోధన తేల్చింది. బరువు నియంత్రణలో ఉన్నంత మాత్రాన పూర్తిస్థాయిలో ఆరోగ్యంగా ఉన్నట్లు చెప్పలేం. ఎందుకంటే వెయిట్ మేనేజ్‌మెంట్‌కు తోడు శారీరక శ్రమ ఉంటేనే జీవక్రియలు సక్రమంగా జరుగుతాయి. అయితే శారీరకంగా చురుకుగా ఉండటం అంటే జిమ్‌లలో గంటల కొద్దీ కష్టపడడం కాదు. వాకింగ్, జాగింగ్, సైక్లింగ్ వంటివి కూడా చేయవచ్చు. ఇవి బద్ధకాన్ని దూరం చేసి శారీరక, మానసిక చురుకుదనాన్ని పెంచుతాయి.

మధుమేహాన్ని నివారించడంలో నిద్ర కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఆహారం, శారీరక శ్రమ, ఇతర జీవనశైలి మార్పులు పాటించినా.. నిద్ర సరిగా లేకపోతే ప్రయోజనం ఉండదు. నిద్ర నాణ్యత తగ్గితే, ఆ ప్రభావం ఆహారం, బరువుపై పడుతుంది. నిద్ర తక్కువ అయినప్పుడు, శక్తి కోసం ఫుడ్ ఎక్కువగా తీసుకుంటారు. ఇది బరువు పెరగడానికి కారణం కావచ్చు. కాబట్టి ప్రతి ఒక్కరూ స్లీప్ సైకిల్‌పై దృష్టిపెట్టాలి. కనీసం 6 నుంచి 7 గంటలు నిద్రపోవాలి. నిద్రవేళలు రోజూ ఒకేలా ఉండటం మంచిది. ఆల్కహాలిక్ డ్రింక్స్ రోజూ తాగడం వల్ల బరువు పెరగవచ్చు. అందుకే ఆల్కహాల్ తక్కువగా తీసుకోవాలి. వీలైతే పూర్తిగా మానేయడం మంచిది. ధూమపానం కూడా ఆరోగ్యానికి హానికరం అనేది తెలిసిందే. అయితే పొగ తాగడానికి, టైప్ 2 డయాబెటిస్‌కు అవినాభావ సంబంధం ఉందని అనేక అధ్యయనాలు తేల్చాయి. పొగ తాగే వారికి మధుమేహం వచ్చే అవకాశాలు 40 శాతం పైగా పెరుగుతాయని పరిశోధనల్లో తేలింది. తక్కువ సమయంలో బరువు తగ్గేందుకు సూచించే ఆహారాలను ఫ్యాడ్ డైట్స్ అంటారు. వీటిలో ఎలాంటి పోషకాలు ఉండవు. ఇవి అనారోగ్యకరమైనవి. దీర్ఘకాలంలో శరీరంపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయి. ఈ ఆహారంలో పూర్తి స్థాయిలో పోషకాలు లేకపోవడం వల్ల... రక్తంలో చక్కెర స్థాయిలు హెచ్చుతగ్గులకు గురవుతాయి. దాంతో డయాబెటిస్ ముప్పు పెరుగుతుంది. అందుకే బరువు తగ్గాలని చూసేవారు ఇలాంటి ఆహారాలు మానుకోవాలి. వీటికి బదులుగా ఆకుకూరలు ఎక్కువగా తినడం, జంక్ ఫుడ్‌కు నో చెప్పడం, వ్యాయామం చేయడం వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

అందుబాటులో వున్న అనేక నివారణా మార్గాల ద్వారా షుగర్ వ్యాధికి చెక్ పెడదాం.

(వ్యాసకర్త: ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు)

కవిత్వం



ఆకలి భారతం....

దున్నే రైతుకు భూమి లేదు
పేదవాడికి జానెడు స్థలం లేదు
భూ కబ్జాలకు అదుపు లేదు
పాలించే భూస్వాములకు జాలి లేదు.

గ్రామాల్లో ఉపాధి కరువు
చదువుకున్నా కొలువుల కరువు
పట్టణాల్లో చేద్దామన్నా నౌకరి కరువు
జానెడు పొట్టకు నాలుగు మెతుకులు కరువు.

అలమటిస్తున్న పేగులు
అలసిపోతున్న బతుకులు
బక్క చిక్కిన శ్రామికుల ఆర్తనాదాలు
దేశ ప్రజల ఆకలి కేకలు.

ఆకలి, పేదరికం, నిరుద్యోగం
అవినీతి, అన్యాయం, అక్రమాలు
మతోన్మాదం అలుముకున్న ఈ దేశం
ఎటువైపు గమ్యం? ఆకలి సూచీలో
ప్రపంచంలో 107వ స్థానం.

ఇదేనా ప్రజలు కలగన్న స్వరాజ్యం?
ఇదేనా భావి భారత భవితవ్యం?
ప్రాథమిక హక్కులకై యోచించి
ప్రశ్నించాలి ప్రభుత్వాలని
ప్రజలందరం.

- ఎస్.కె. బాజీ సైదా
సెల్ : 8897282981

గోవాలో ఇండిగో విమానానికి తప్పిన ముప్పు..

హైదరాబాద్ : గోవాలో ఇండిగో విమానానికి తృటిలో ముప్పు తప్పింది. 180 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి గోవా ఇండిగో ఫ్లైట్ వెళ్లింది. అక్కడ ల్యాండింగ్ సమయంలో రన్‌వే పైకి మరో విమానం దూసుకొచ్చింది. దీంతో ఇండిగో విమానం ల్యాండ్ అయిన 15 సెకన్లలోనే మళ్లీ టేకాఫ్ అయింది. గాల్లోనే 20 నిమిషాలపాటు చక్కర్లు కొట్టింది. చివరకు ఏటీసీ నుంచి క్లియరెన్స్ రావడంతో సేఫ్‌గా ల్యాండ్ అయింది. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని విషయాలు తెలియాల్సి ఉంది.

షారుఖ్‌ను అడ్డగించిన కస్టమ్స్ అధికారులు

ముంబయి : బాలివుడ్ స్టార్ షారుఖ్ ఖాన్‌ను ముంబయి విమానాశ్రయంలో శుక్రవారం రాత్రి కస్టమ్స్ అధికారులు అడ్డుకున్నారు. ఆయనను బయటకు వెళ్ళనివ్వకుండా ఆంక్షలు విధించారు. షారుఖ్, ఆయన వెంట వున్నవారు విలాసవంతమైన వాచీలు తీసుకెళుతున్నారన్న కారణంగా కొద్ది గంటల పాటు నిలువరించినట్లు అధికారులు తెలిపారు. షార్జాలో ఒక కార్యక్రమానికి హాజరై షారుఖ్ తిరిగి వస్తున్నారు. ఖాన్, ఆయన వెంట వున్న వారి సామానుల్లో 18 లక్షల విలువైన ఆరు వాచీలు దొరికాయని సమాచారం. ఖాన్ రూ.6.83 లక్షల మొత్తాన్ని కస్టమ్స్ సుంకంగా చెల్లిస్తే వెళ్లవచ్చని సంబంధిత అధికారులు సూచించారు. దీంతో కస్టమ్స్ లాంఛనాలు పూర్తి చేసుకుని ఖాన్, ఆయన మేనేజర్ అక్కడ నుండి వెళ్లిపోయారు. ఆయన అంగరక్షకుడు, ఇతర సభ్యులు మాత్రం ఉదయం వరకు అక్కడే వుండిపోయారు.

తమిళనాడులో భారీ వర్షాలు

చెన్నయ్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో తమిళనాడులో కొన్ని రోజులుగా వర్షాలు దంచికొడుతున్నాయి. కావేరీ తీర ప్రాంతమంతటా భారీ వర్షాలు పడ్డాయి. ఈ ప్రాంతంలో శనివారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 44 సెంమీ వర్షపాతం నమోదైంది. దాదాపు 5 వేల మందిని సహాయక శిబిరాలకు తరలించారు. నష్ట నివారణకు ప్రభుత్వం ముందస్తుగానే భారీ ఎత్తున చర్యలు చేపట్టింది. చెన్నయ్, తిరువళ్లూరు, రాణీపేట్, కాంచీపురం జిల్లాలకు అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. చెన్నై సహా పలు జిల్లాలకు రానున్న రెండు మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకావం ఉందని చెన్నై వాతావరణ శాఖ శనివారం నాడు హెచ్చరికలు జారీ చేసింది. చెన్నయ్ రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పలుచోట్ల పంట పొలాలు నీట మునిగాయి. రోడ్లపై భారీగా వరదనీరు చేరింది. ఎడతెరిపి లేని వర్షాలతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. భారీ వర్షాల నేపథ్యంలో చెన్నై సహా రాష్ట్రంలోని దాదాపు 26 జిల్లాలకు పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది.

లౌకిక శక్తుల విస్తృత సమీకరణతో బిజెపిపై పోరు

- ఆర్‌ఎస్‌పి 22వ జాతీయ మహాసభలో సీతారాం ఏచూరి
- ఆర్‌ఎస్‌ఎస్ కేంద్రాలుగా మారిన రాజ్ భవన్‌లు : డి రాజా విమర్శ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ఆర్‌ఎస్‌పి మహాసభలో సౌహార్ద్ర సందేశమిస్తున్న సీతారాం ఏచూరి

బిజెపిని ఒంటరిపాల్జేసి ఓడించేందుకు లౌకిక శక్తులను విస్తృతంగా సమీకరించాలని, ఇందుకోసం వామపక్ష ఐక్యతను బలోపేతం చేయాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపు ఇచ్చారు. ఢిల్లీలోని కాన్టిట్యూషన్ క్లబ్‌లో ఆర్‌ఎస్‌పి 22వ జాతీయ మహాసభలో ఆయన సంఘీభావ సందేశమిచ్చారు. ఆర్‌ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో వామపక్ష పార్టీలతో పాటు కాంగ్రెస్ నేతలు సౌహార్ద్ర సందేశాలు ఇచ్చారు. తొలుత సీతారాం ఏచూరి మాట్లాడుతూ దేశాన్ని రక్షించాలంటే బిజెపిని ఓడించాల్సిందేనన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదంపై మోడీ సర్కార్ తీవ్రమైన దాడి చేస్తోందని, దీన్ని ఎదుర్కొనేందుకు సైద్ధాంతిక పోరాటం చేయాలని అన్నారు. దేశ లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాన్ని, ఫాసిస్ట్ హిందూత్వ రాజ్యంగా మార్చాలని తీవ్ర ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో కనీసం చర్చకు కూడా కేంద్ర ప్రభుత్వం పరిణలోకి తీసుకోవడం లేదన్నారు. ఇడి, సిబిఐ వంటి కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు బిజెపి రాజకీయ ఏజెన్సీలుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. గవర్నర్ల వ్యవస్థను దుర్వినిగపరుస్తూ బిజెపేతర ప్రభుత్వాలపై కేంద్రం దాడికి పూనుకుంటోందని తప్పుబట్టారు. కేరళ, తమిళనాడు, తెలంగాణల్లో గవర్నర్ల ఎలా వ్యవహరిస్తున్న తీరుపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై కూడా సంతకాలు చేయటం లేదని విమర్శించారు.

రాజ్యాంగ మూల స్థంభాలైన ఆర్థిక స్వతంత్రత, లౌకిక ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థ, సామాజిక న్యాయం కూడా దాడికి గురవుతున్నాయని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో రాజ్యాంగ విరుద్ధమైన చట్టాలను తీసుకొస్తున్నారని విమర్శించారు. ముస్లీం మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారని తెలిపారు. మతానికి సంబంధించిన కార్యక్రమాలను ప్రభుత్వ కార్యక్రమంగా చేయడం ఇదే మొదటి సారని అన్నారు. హిందూ మత కార్యక్రమాల్లాగే, ఇతర మతాల కార్యక్రమాలను ప్రధాని మోడీ నిర్వహిస్తారా? అని ప్రశ్నించారు. పూజార్లు చేయాల్సిన కార్యక్రమాలను కూడా ప్రధాని చేయడం దారుణమని, మతం, ప్రభుత్వం మధ్య ఎటువంటి తేడా లేదనే సందేశం ఇస్తున్నారని విమర్శించారు. ఇండియా హిందూత్వ దేశంగా మార్చడంలో ఇది భాగమని, దేశ రాజ్యాంగ నిర్మాణాన్ని ధ్వంసం చేసేందుకు హిందూత్వ శక్తులు పూనుకుంటున్నాయని దుయ్యబట్టారు.

దేశంలో కార్పొరేట్, మతోన్మాద మైత్రీ చాలా ప్రమాదకరంగా తయారైందని, మనముందున్న ఈ సవాలును ప్రజా పోరాటాల బలోపేతంతోనే ప్రతిఘటించగలమని పేర్కొన్నారు. నిరుద్యోగం, ఆకలి, ధరలు పెరుగుదలతో పాటు ప్రజలపై భారాలు కూడా విపరీతంగా పెరిగాయని తెలిపారు. దేశంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు పోరాడుతున్నాయని, దేశ సంపద లూటీకి వ్యతిరేకంగా పోరాటాలు, రైతుల లాంగ్ మార్చ్‌లు జరుగుతున్నాయని తెలిపారు. బ్రిటిష్ నుండి రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిందని, దాన్ని ఆర్థిక స్వాతంత్ర్యంగా మార్చాలని వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు. అది సోషలిజం వల్లనే సాధ్యమవుతుందన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ కేంద్రాలుగా గవర్నర్ల కార్యాలయాలు

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ కేంద్రాలుగా రాజ్ భవన్‌లు మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తన వైఖరి మార్చుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ హిందూత్వాన్ని తలకెత్తుకోవద్దని సూచించారు. కాంగ్రెస్ సెంటర్ లెఫ్ట్‌గానే ఉండాలని, సెంటర్ రైట్ కాకుడదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా అన్ని పార్టీలు ఐక్యంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ సెంటరిక్ పార్టీ అని, అయితే కొన్ని సందర్భాల్లో లెఫ్ట్, కొన్ని సందర్భాల్లో రైట్‌గా మారుతున్నామని చెప్పుకొచ్చారు. బలమైన కాంగ్రెస్ లేకపోతే, బలమైన ప్రతిపక్షం ఉండదని పేర్కొన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి దేవ రాజన్, సిపిఐఎంఎల్ లిబరేషన్ పొలిట్ బ్యూరో సభ్యులు రవి రాయ్ తదితరులు మాట్లాడారు.

చప్పగా మోడీ ప్రసంగం

- రాష్ట్ర సమస్యలపై నోరు విప్పని వైనం

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఒక ప్రాంతానికి లేదంటే, ఒక రాష్ట్రానికి సాక్షాత్తూ దేశ ప్రధాని వచ్చి సభలు, కార్యక్రమాల్లో పాల్గొన్నారంటే ప్రధానమైన సమస్యలపై స్పందించి పరిష్కారం చూపుతారని ఆ ప్రాంత ప్రజానీకం ఆశించడం సహజం. విశాఖలోని ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బహిరంగ సభ దీనికి భిన్నంగా సాగింది. ప్రధాని రాష్ట్రానికి సంబంధించిన కీలకసమస్యలను పూర్తిగా విస్మరించారు. ఈ సభ విజయవంతం కోసం రూ.19 కోట్లును గడిచిన 15 రోజులుగా ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. కానీ పట్టుమని మొత్తం సభ కనీసం గంట కూడా సాగలేదు. ఈ ప్రాంత ప్రయోజనాలను పరిరక్షించే ప్రకటన చేయడం కానీ, హామీ ఇవ్వడం గానీ ప్రధాని చేయలేదు. దీంతో, ఈ సభకు హాజరైన ప్రజానీకంలో తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తమైంది.

ప్రధాన అంశాలపై మౌనం

ఎయు మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సభ శనివారం ఉదయం 10.15 గంటలకు ప్రారంభమై 11.15 గంటలలోపే ముగిసింది. సిఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ ఎపికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సమస్యలను గుర్తు చేశారు. జగన్ తర్వాత ప్రసంగించిన ప్రధాన మంత్రి మోడీ వీటిని కనీసం పరిగణలోకి తీసుకోలేదు. ఎపి విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలో జరగాల్సిన ప్రధాన పనులైన పోలవరం, ఎపికి ప్రత్యేక హోదా, జాతీయ విద్యాసంస్థలు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి కీలకమైన ప్రాజెక్టుల ప్రస్తావనా చేయలేదు. ఏడాదిన్నర కాలంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కార్మికవర్గం, విశాఖ ప్రజానీకం పోరాడుతున్నా ఇక్కడే సమస్యా లేదన్న రీతిలో వ్యవహరించారు. తొలుత వైఎస్ జగన్ ఏడు నిమిషాలపాటు సభలో మాట్లాడారు. తర్వాత ప్రధాని మోడీ ప్రసంగం దాదాపు 26 నిమిషాలు సాగింది. సిఎం తెలుగులోనూ, ప్రధాని హిందీలోనూ మాట్లాడారు. విశాఖకు స్వయంగా మోడీ ప్రకటించిన రైల్వే జోన్ అంశం జోలికి సైతం ఆయన వెళ్లలేదు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మబోం అనే ప్రకటనను విశాఖ వేదికగా 12న మోడీ చేయాలంటూ ఈ ప్రాంత ప్రజానీకం, ప్రజాసంఘాలు, కార్మికులు, మేధావులు కోరారు. కానీ, మోడీ మాత్రం తనకేమీ పట్టనట్టే వ్యవహరించారు. కేవలం రూ.10 వేల కోట్ల ప్రాజెక్టులకే పరిమితం అయ్యారు.

రాష్ట్రపతికి తృణమూల్ నేత క్షమాపణ

నందిగ్రామ్ : రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు పశ్చిమ బెంగాల్ మంత్రి అఖిల్ గిరి శనివారం తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు. అనంతరం తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పారు. 'నేను బాగోనని వారు (బిజెపి) అన్నారు. బాహ్య రూపాన్ని బట్టి మనం ఎవరినీ అంచనా వేయరాదు. రాష్ట్రపతి కార్యాలయాన్ని మనం గౌరవించాలి. కానీ, మన రాష్ట్రపతి ఎలా వుంటారు?' అని గిరి వ్యాఖ్యానించిన 17 సెకండ్ల వీడియో క్లిప్ బయటకు వచ్చింది. శుక్రవారం సాయంత్రం నందిగ్రామ్‌లోని ఒక ర్యాలీలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, మంత్రి వైఖరిపై తృణమూల్ కాంగ్రెస్ సైతం ఆగ్రహం వ్యక్తం చేసింది. మహిళా సాధికారతా శకంలో ఇటువంటి స్త్రీ విద్వేషం ఆమోదయోగ్యం కాదని ఖండించింది. గిరి వ్యాఖ్యలకు పార్టీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. అనంతరం దీనిపై మంత్రి స్పందించారు. 'గౌరవనీయులైన రాష్ట్రపతిని అవమానించాలన్నది నా అభిమతం కాదు. బిజెపి నేతలు రోజూ నాపై చేస్తున్న దాడికి సమాధానం చెప్పాను. నేనెలా వుంటానో వారు రోజూ విమర్శిస్తున్నారు. రాష్ట్రపతిని అగౌరవపరిచానని ఎవరైనా భావిస్తే అది పొరపాటు. అటువంటి వ్యాఖ్యలు చేసినందుకు నేను క్షమాపణ చెబుతున్నాను. మన దేశ రాష్ట్రపతి పట్ల అపారమైన గౌరవం వుంది' అని ఆయన చెప్పారు.

సింగరేణిని ప్రైవేటీకరించం

- రామగుండం సభలో ప్రధాని మోడీ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో



ప్రభుత్వరంగ సంస్థ సింగరేణిని ప్రైవేటీకరణ చేసే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. సింగరేణిలో మెజార్టీ వాటా 51 శాతం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటే, కేంద్రం ఎలా విక్రయిస్తుందని ప్రశ్నించారు. ఈ విషయంలో కొందరు అబద్దాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండం లోని రామగుండం ఫెర్టిలైజర్స్, కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సిఎల్) ఎరువుల కర్మాగారాన్ని, భద్రాచలం రోడ్ నుంచి సత్తుపల్లి వరకూ నిర్మించిన రైలు మార్గాన్ని శనివారం ఆయన జాతికి అంకితం చేశారు. రూ.2,268 కోట్లతో చేపట్టిన మెదక్-సిద్దిపేట-ఎల్కతుర్తి హైవే విస్తరణ పనులు, బోధన్-బాసర-భైంసా హైవే పనులకు, సిరోంచా-మహాదేవ్‌పూర్ జాతీయ రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మోడీ మాట్లాడుతూ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించిందన్నారు. యూరియాను విదేశాల నుంచి అధిక ధరకు దిగుమతి చేసుకోవాల్సి వస్తోన్నా, రైతులకు కొరత రాకుండా అనేక చర్యలు చేపట్టామని తెలిపారు. అంతకుముందు బేగంపేటలో బిజెపి నిర్వహించిన స్వాగత సభలో మోడీ మాట్లాడుతూ తెలంగాణలోని ప్రస్తుత ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదని, వచ్చేది బిజెపి సర్కారేనని జోస్యం చెప్పారు. తనను తిట్టేవాళ్ల గురించి పెద్దగా పట్టించుకోనని, బిజెపిని దూషించినా పర్వాలేదని, కానీ, తెలంగాణ ప్రజల జోలికి వస్తే సహించేది లేదని, పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అన్నారు. అవినీతి, కుటుంబపాలన నుంచి తెలంగాణను రక్షించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

జార్ఖండ్ సిఎం హేమంత్‌కు ఊరట

- ఎన్నికల కోడ్ ఉల్లంఘనలో క్రిమినల్ ప్రొసీడింగ్స్ రద్దు
- ఆ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు



రాంచీ : రాష్ట్రంలో 2019లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కోడ్‌ను ఉల్లంఘించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న జార్ఖండ్ సీఎం హేమంత్ సొరెన్‌కు ఊరట లభించింది. ఆయనపై క్రిమినల్ ప్రొసీడింగ్‌లను జార్ఖండ్ హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై మూడేండ్ల క్రితం అర్గోరా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిని హేమంత్ సొరెన్ సవాలు చేశారు. రాంచీలోని జ్యుడీషియల్ మేజిస్ట్రేటు కోర్టు ఇంతకుముందు సొరెన్‌కు సమన్లు జారీ చేసింది. వ్యక్తిగతంగా హాజరు కావాలనీ ఆదేశించింది. దీనిని కూడా ఆయన కోర్టు ముందు సవాలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ సంజయ్ కుమార్ ద్వివేది కోర్టుకు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు కేసు దాఖలు చేశారనీ, అయితే ఈ విషయంలో ఫిర్యాదు మాత్రమే నమోదు చేయొచ్చని చట్టం తెలుపుతున్నదన్నారు. ఈ కేసులో అన్ని పక్షాల వాదనలను విన్న న్యాయస్థానం.. సాంకేతిక లోపం ఉన్నదని నిర్ధారించింది. సొరెన్‌పై క్రిమినల్ ప్రొసీడింగ్‌లను రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ఢిల్లీలో భూ ప్రకంపనలు

ఢిల్లీ : శనివారం సాయంత్రం 7.57 గంటలకు నేపాల్‌లో 5.4 తీవ్రతతో భూకంపం వచ్చింది. దీని ఫలితంగానే దేశంలోని ఢిల్లీ, ఉత్తరాఖండ్, హిమాలయ రాష్ట్రాల్లో ప్రకంపనలు ఏర్పడ్డాయి. భూకంప కేంద్ర భూమికి 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. ఢిల్లీతో పాటు పరిసర నగరాల్లో బలమైన భూప్రకంపనలు సంభవించాయి. చాలా మంది ఇండ్లు, ఆఫీసుల నుంచి బయటకు వచ్చారు. దాదాపుగా 5 సెకన్ల పాటు భూమి కంపించింది. మంగళవారం నేపాల్‌లో 6.3 తీవ్రతతో భూకంపం రావడంతో తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఢిల్లీలో బలమైన ప్రకంపనలు సంభవిచాయి. ఈ భూకంపం సుమారు 10 కిలోమీటర్ల లోతులో సంభవించింది. నేపాల్‌లో ఆరుగురు మరణించగా.. ఎనిమిది మంది గాయపడ్డారు. నోయిడా, గురుగ్రామ్‌లో కూడా ఇదే విధంగా ప్రకంపనలు కనిపించాయి. నేపాల్ దేశంలో మరో భూకంపం వచ్చినట్లు తెలుస్తోంది. దీని ప్రకంపనలు దేశరాజధానితో పాటు హిమాలయ రాష్ట్రాల్లో కనిపించాయి. ఇటీవల కాలంలో హిమాలయాల్లో తరుచుగా భూకంపాలు సంభవిస్తున్నాయి. పరిశోధకులు కూడా త్వరలోనే హిమాలయాల్లో భారీ భూకంపం వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.


వేలూరు జైలు నుంచి విడుదలైన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న నళిని ఆమె భర్త వి శ్రీధరన్ అలియాస్ మురుగన్

నళినీ సహా ముగ్గురు విడుదల

వెల్లూరు : రాజీవ్‌గాంధీ హత్య కేసులోని ఆరుగురు దోషులను విడుదల చేయాల్సిందిగా సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసిన మరుసటి రోజే శనివారం ముగ్గురు జైలు నుండి విడుదలయ్యారు. వీరిలో నళిని శ్రీహరన్, ఆమె భర్త మురుగన్, సంతాన్‌లు వున్నారు. విడుదలకు అవసరమైన లాంఛనాలను పూర్తి చేసేందుకు వెల్లూరు జైలుకు కాసేపు వచ్చిన అనంతరం వారు ముగ్గురు శనివారం సాయంత్రం బయటకు వచ్చారు. పెరోల్ షరతుల్లో భాగంగా ఆమె నేటి ఉదయం స్థానిక పోలీసు స్టేషన్‌కు వెళ్ళారు. ఏడవ దోషి పెరారివలన్‌ను విడుదల చేసేందుకు అసాధారణ అధికారాలను సుప్రీం కోర్టు మే నెల్లో ఉపయోగించుకుంది. దీంతో అదే ఆదేశాలను మిగిలిన వారికి కూడా వర్తింపచేసినట్లు కోర్టు తెలిపింది. కాగా కాంగ్రెస్ ఈ ఆదేశాల పట్ల తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. నళిని సోదరుడు బకియానాథన్ దీనిపై మాట్లాడుతూ దోషులు ఇప్పటికే మూడు దశాబ్దాల జైలు జీవితాన్ని అనుభవించారని, అందువల్ల వారిని మానవతా దృక్పథంతో విడుదల చేశారని, వారి విడుదలను వ్యతిరేకించే వారు భారత చట్టాలను గౌరవించాలని వ్యాఖ్యానించారు.

ఉక్రెయిన్ నియంత్రణలోకి ఖేర్సన్

మాస్కో: ఖేర్సన్ నగరం క్రమంగా తమ నియంత్రణలోకి వస్తున్నట్లు ఉక్రెయిన్ రక్షణ శాఖ వెల్లడించింది. సైన్యం ఇప్పటికే నగరంలోకి ప్రవేశించిందని తెలిపింది. స్థానికంగా ఎవరైనా రష్యా సైనికులు ఉంటే.. వెంటనే లొంగిపోవాలని సూచించింది. తమ సేనలు దాదాపు 41 ప్రాంతాలను విముక్తి చేసినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఇప్పటికే ప్రకటించారు. రష్యా సేనలు పేలుడు పదార్థాలను వదిలిపెట్టాయన్న అనుమానంతో.. వాటిని తొలగించేందుకు సంబంధిత నిపుణులు రంగంలోకి దిగారు. మరోవైపు.. ఖేర్సన్ సమీప మైకోలైవ్‌లోని నివాసిత ప్రాంతాలపై రష్యా క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో ఏడుగురు మతి చెందినట్లు స్థానిక అధికారులు తెలిపారు. సిబ్బందితోపాటు ఆయుధ సామగ్రినినిప్రో నది పశ్చిమ తీరం నుంచి బలగాలను పూర్తిగా వెనక్కు తీసుకున్నట్లు రష్యా రక్షణ శాఖ తెలిపింది. ఉక్రెయిన్‌లోని ఖేర్సన్, దాని పరిసర ప్రాంతాల నుంచి వైదొలగుతున్నట్లు రష్యా సైన్యం బుధవారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఉపసంహరణ ప్రక్రియ పూర్తయినట్లు మాస్కో శుక్రవారం వెల్లడించింది. ఈ పరిణామాన్ని ఉక్రెయిన్ 'కీలక విజయం'గా అభివర్ణించింది. ప్రజల సందడి, నగరవ్యాప్తంగా ఉక్రెయిన్ జెండాలు వెలిసిన దశ్యాలు సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తున్నాయి.

బిజెపికి తిరుగుబాటు పోటు !

- గుజరాత్‌లో స్వతంత్రులుగా బరిలో ఐదుగురు నేతలు

అహ్మదాబాద్ : హిమాచల్ ప్రదేశ్ ఎన్నికల్లో రెబెల్స్ బెడదను ఎదుర్కొంటున్న బిజెపికి గుజరాత్ ఎన్నికల్లోనూ ఆ పరిస్థితి తప్పేలా కనిపించడం లేదు. రెండు దశల్లో డిసెంబరు 1, 5 తేదీల్లో జరగనున్న గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టిక్కెట్లు రాని సిట్టింగ్ బిజెపి ఎంఎల్‌ఎ, మరో నలుగురు మాజీ ఎంఎల్‌ఎలు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తామని ప్రకటించారు. తమ మద్దతుదారులతో సంప్రదించిన అనంతరం తదుపరి చర్య తీసుకుంటామని చెబుతున్నారు. బిజెపి మాజీ ఎంఎల్‌ఎ, పార్టీ గిరిజన నేత అయిన హర్షద్ వాస్తవ్ శుక్రవారం నామినేషన్ పత్రాలు కూడా దాఖలు చేశారు. నాందోడ్ (ఎస్‌టి సీటు) నుండి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ స్థానమైన నాందోడ్‌లో బిజెపి డాక్టర్ దర్శనా దేశ్‌ముఖ్‌ను బరిలోకి దింపింది. దీనిపై అసంతృప్తిగా వున్న హర్షద్ వెంటనే బిజెపిలోని తన పదవికి రాజీనామా చేశారు. నామినేషన్ వేసేశారు. ఇప్పటి వరకు గుజరాత్ బిజెపి ఎస్‌టి మోర్చా విభాగానికి అధ్యక్షునిగా వున్నారు. ఇటీవల మరణించిన బిజెపి నేత హరేన్ పాండ్యా భార్య జాగృతి పాండ్యా బిజెపి ఎంఎల్‌ఎ రాకేష్ షా చేసిన ప్రకటనపై శనివారం తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. తన భర్త పదవీ కాలంలో వచ్చిన ఓట్లకు, షా పదవీ కాలంలో వచ్చిన ఓట్లకు పోలిక తెస్తూ ఆయన మాట్లాడాన్ని తీవ్రంగా విమర్శించారు. 1995లో హరేన్ పాండ్యా పోటీ చేసినపుడు 66 శాతం ఓట్లు సవ్తే తాను పోటీ చేసినపుడు 80 శాతానికి పెరిగాయని షా అన్నట్లు వచ్చిన మీడియా కథనాన్ని ప్రస్తావిస్తూ జాగృతి నగర బిజెపి చీఫ్‌కి లేఖ రాశారు. ఇలా బిజెపి నేతల్లో లుకలుకలు మొదలయ్యాయి.

324 నామినేషన్లు..ఆప్ నుంచి 70

గుజరాత్‌లో రెండు దశల్లో జగరనున్న అసెంబ్లీ ఎన్నికలకు శనివారం నాటికి 324 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల సంఘం తెలిపింది. మొదటి దశలో డిసెంబరు 1న పోలింగ్ జరగనున్న స్థానాలకు 316 నామినేషన్లు దాఖలు కాగా రెండో దశలో పోలింగ్ జరగనున్న స్థానాలకు 8 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇసి వెల్లడించిన వివరాల ప్రకారం..ఆమాద్మీ పార్టీ 70 నామినేషన్లు, అధికార బిజెపి 52, ప్రతిపక్ష కాంగ్రెస్ 48, బిఎస్‌పి 21, భారతీయ ట్రైబల్ పార్టీ (బిటిపి) 9 చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి.

పర్మినెంట్ చేయండి

టిటిడి ఫారెస్ట్ కార్మికుల నిరసనలకు రెండేళ్లు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

అర్హులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ తిరుపతిలోని హరేరామ హరేకృష్ణ ఆలయం సమీపంలో గల డిఎఫ్‌ఒ కార్యాలయం వద్ద టిటిడి ఫారెస్టు కార్మికులు శనివారం నిరసన చేపట్టారు. గంటల తరబడి జోరువానలో కార్మికులు తమ నిరసనను కొనసాగించారు. టైంస్కేల్ ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి రెండు సంవత్సరాలు పూర్తయింది. ఈ సందర్భంగా కార్మికులనుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కందారపు మురళి మాట్లాడుతూ.. 2019లో టిటిడి పాలకమండలి చేసిన తీర్మానాన్ని అమలు చేయాలని కోరుతూ రెండు సంవత్సరాలుగా కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేస్తోన్నా యాజమాన్యం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఫారెస్ట్ విభాగంలో పనిచేస్తోన్న కొంతమందిని పర్మినెంట్ చేసి, మరికొందరిని చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజకీయ ఒత్తిళ్లతో విభజించు- పాలించు పద్ధతిని వ్యవహరించడం సరైనది కాదని టిటిడి యాజమాన్యానికి సూచించారు. అర్హులైన కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి ఆర్.లక్ష్మీ, సురేష్, ఈశ్వర్‌రెడ్డి, పురుషోత్తం, కార్మికులు పాల్గొన్నారు.

ఒక్కరు మినహా అందరూ ఓటేశారు !

సిమ్లా : ప్రపంచంలోనే అతి ఎత్తైన పోలింగ్ కేంద్రంగా గుర్తింపు పొందిన హిమాచల్ ప్రదేశ్‌లోని తాషిగాంగ్‌లో 98.08 శాతం పోలింగ్ జరిగింది. ఈ పోలింగ్ కేంద్రంలో మొత్తం 52 మంది ఓటర్లు నమోదయ్యారు. వీరిలో ఒకరు మినహా అందరూ అంటే 51 మందీ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సముద్ర మట్టానికి 15,256 అడుగుల ఎత్తులో ఈ పోలింగ్ స్టేషన్ వుంది.


ఈ సారి ఎన్నికల్లో వందేళ్ళు దాటిన ఇద్దరు వ్యక్తులు కూడా తమ ఓటు హక్కు వినియోగించుకోవడం విశేషం. 83 ఏళ్ల నిండిన మహిళ డోల్మా ఏకంగా 14 కిలోమీటర్లు నడిచి వెళ్ళి మరీ తన ఓటు వేశారు. ఎన్నికల కమిషన్ గణాంకాల ప్రకారం..హిమాచల్ ప్రదేశ్‌లో 80 ఏళ్లు పైబడినవారు 1.21 లక్షల మంది ఉన్నారు. వీరిలో 1136 మంది శతాధిక వయోధికులు కావడం మరో విశేషం. వికలాంగులతో పాటు సీనియర్ సిటిజన్లకు కూడా ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

ఎవరికి వారికే ధీమా

పాలక పక్షాన్ని ఓడించి, ప్రతిపక్షానికి అధికారం కట్టబెట్టే సాంప్రదాయం వున్నందున తామే అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ భావిస్తోంది. రెండోసారి గెలిచి రికార్డు సృష్టిస్తామని బిజెపి నమ్మకంగా వుంది. కాగా పాలక పార్టీకి రెబెల్స్ పెద్ద తలనొప్పిగా తయారయ్యారు. పెద్ద సంఖ్యలో ఈ సారి వారు బరిలో వుండడం ఆందోళన కలిగించే అంశంగా వుంది. 2017 ఎన్నికల్లో మొత్తం 68సీట్లకు గానూ బిజెపి 44 సీట్లను గెలుచుకోగా, కాంగ్రెస్ 21 స్థానాలతో సరిపెట్టుకుంది. మరోపక్క 2004కి పూర్వపు పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రధాన అంశంగా వుంది. ఎందుకంటే రాష్ట్రంలో 2 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు వున్నారు. ఈ దఫా ఎన్నికల్లో సిపిఎం 11 స్థానాల్లో తన అభ్యర్థులను బరిలో నిలిపింది. రాష్ట్రంలోని 55 లక్షల మంది పైగా ఓటర్లు 412 మంది అభ్యర్థుల రాజకీయ భవితవ్యాన్ని ఓటింగ్ యంత్రాల్లో నిక్షిప్తం చేశారు. ఎన్నికల ఫలితాలు డిసెంబరు 8న వెల్లడవుతాయి.

ద్రవ్యోల్బణం 7 శాతానికి దిగువకు తగ్గొచ్చు

- ఆర్‌బిఐ గవర్నర్ అంచనా



న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ) సూచీ ఏడు శాతం దిగువనకు తగ్గొచ్చని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అంచనా వేశారు. శనివారం ఆయన హెచ్‌టి లీడర్‌షిప్ సమ్మిట్ 2022లో మాట్లాడుతూ ద్రవ్యోల్బణం తమకు ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. తాము నిర్దేశించుకున్న లక్ష్యం 6 శాతం పరిమితి కంటే ఎక్కువగా నమోదవుతుందన్నారు. సెప్టెంబర్‌లో ఇది 7.4 శాతానికి ఎగిసిన విషయాన్ని దాస్ గుర్తు చేశారు. "అక్టోబర్ మాసం ద్రవ్యోల్బణం సూచీ గణంకాలు సోమవారం విడుదల కావొచ్చు. ఇది 7 శాతం దిగువన ఉండొచ్చు. ధరల కట్టడికి చాలా ప్రభావితంగా పని చేస్తున్నాము." అని దాస్ తెలిపారు. గ్లోబల్ ద్రవ్యోల్బణం కూడా రానున్న రోజుల్లో దిగిరానుందన్నారు. వచ్చే ఫిబ్రవరి నాటికి భారత్‌లో ద్రవ్యోల్బణం 4.5 శాతానికి తగ్గొచ్చని అంచనా వేశారు. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక ఘర్షణలు ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తున్నాయన్నారు. దేశంలో సిపిఐని 4 శాతానికి కట్టడి చేయాలని కృత నిశ్చయంతో ఉన్నామన్నారు.


వరుస వివాదాల్లో సునాక్



లండన్ : బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ శనివారం తిరిగి తాజా వివాదంలో చిక్కుకున్నారు. కేబినెట్ నియామకాల ఎంపికపై ఆయన సరికొత్త ప్రశ్నలను ఎదుర్కొంటున్నారు. డిప్యూటీ ప్రధాని, న్యాయ శాఖా మంత్రి డొమినిక్ రాబ్, సిబ్బంది పట్ల దురుసుగా వ్యవహరించారని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో తాజాగా ఈ వివాదం రేగింది. మరో సీనియర్ కన్జర్వేటివ్ నేతను బెదిరించారనే ఆరోపణల కారణంగా కొత్త ప్రభుత్వం నుండి సునాక్ మిత్రుడు గవిన్ విలియంసన్‌ను డొమినిక్ రాబ్ బలవంతంగా తొలగించారు. పైగా రాబ్ గత వ్యవహార శైలి కారణంగా ఆయన నేతృత్వంలో పని చేయలేమనుకున్న దాదాపు 15 మంది సీనియర్ అధికారులను వేర్వేరు ప్రభుత్వ విభాగాలకు బదిలీ చేయడానికి కూడా ప్రతిపాదించినట్లు గార్డియన్ వార్తా పత్రిక పేర్కొంది.

బ్రిటన్ ఎన్నికల సమయంలో తనకు గట్టి మద్దతుదారుగా నిలిచిన రాబ్‌ను వెంటనే సునాక్ తిరిగి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. గతంలో నిర్వహించిన న్యాయ శాఖ పదవినే అప్పగించారు కూడా. రాబ్ తీరు పట్ల ఇప్పటికే అసంతృప్తిగా వున్నవారు ఈ నియామకంపై తీవ్రంగా విమర్శలు చేశారు. విలియంసన్‌పై దర్యాప్తు జరుగుతుండగానే ఆయన్ని తిరిగి మంత్రిగా తీసుకోవడంపై కూడా సునాక్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. అధికారిక సమావేశం జరుగుతున్న సమయంలో ఆగ్రహం పట్టలేక రాబ్, సలాడ్ నుండి టమోటాలు తీసి విసిరివేసిన విషయాన్ని మరో పత్రిక సన్ ప్రచురించింది. కాగా, ఇదంతా అర్ధం లేని రాతలంటూ రాబ్ ప్రతినిధి వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్క వ్యవహారం బయటపడుతున్న కొద్దీ ఆయన బలహీన నేత అనే విషయం మరింతగా తేటతెల్లమవుతోందంటూ ప్రతిపక్ష లేబర్ పార్టీ విమర్శించింది. అయితే దీనిపై సునాక్ నుండి వెంటనే ఎలాంటి ప్రతిస్పందన రాలేదు.

ఆస్ట్రేలియా క్రూయిజ్ నౌకలో 800 కోవిడ్ కేసులు



సిడ్నీ : ఆస్ట్రేలియా కంపెనీకి చెందిన మెజెస్టిక్ ప్రిన్సెస్ క్రూయిజ్ నౌకలో దాదాపు 800 కోవిడ్ కేసులు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో అత్యంత ముప్పు పొంచి వుందని సిడ్నీ అధికారులు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ నౌకను సిడ్నీ తీరంలో నిలిపివేశారు. న్యూజీలాండ్ నుండి బయలుదేరిన ఈ నౌకలో 4600మంది ప్రయాణికులు, సిబ్బంది వున్నారు. కోవిడ్ నిబంధనలు తగిన రీతిలో అమల్లో వున్నాయని, ఆందోళన చెందవద్దంటూ ఆస్ట్రేలియా హోం మంత్రి క్లారే ఓ నీల్ ప్రజలను కోరారు. వ్యాధి సంక్రమణ అధిక స్థాయిలో వుండే 'టైర్ 3' గా ఈ రిస్క్ స్థాయిని అధికారులు ప్రకటించారు. 2020లో ఇలాగే రూబీ ప్రిన్సెస్ క్రూయిజ్ నౌకలో కూడా కరోనా కేసులు పెచ్చరిల్లాయి. ఆనాటి ఘటనలో 914మందికి వైరస్ సోకగా, 28మంది మరణించారు. తాజాగా ఏ కేసుకు ఆ కేసును పరిశీలిస్తూ, వాటి ప్రాతిపదికన ఈ నౌకలోని ప్రయాణికులను ఎలా దించాలనేది ఆలోచిస్తున్నామని ఆరోగ్య శాఖాధికారులు తెలిపారు. నౌకలో కోవిడ్ వచ్చిన వారినందరినీ విడిగా, వైద్య సిబ్బంది సంరక్షణలో వుంచామని కార్నివాల్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆస్ట్రేలియావ్యాప్తంగా కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి, ఒమిక్రాన్ వేరియంట్ ఎక్స్‌బిబి చాలా తీవ్రంగా సంక్రమిస్తోంది.



ఉదయం 8 గంటలు. గుంటూరు సాయిబాబా రోడ్డు అంతా బస్సులు, ఆటోలు, బళ్ల ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోయింది. ఆ బస్సుల, ఆటోల మధ్యలో నుంచి, సందుల్లో దూరుకుంటూ వెళుతుంది మా నాన్న నడుపుతున్న స్కూటీ. ఎందుకంటే... ఉదయం ఎనిమిది గంటలకల్లా నేను స్కూల్లో ఉండాలి. లేకుంటే మా క్లాస్ టీచర్ నన్ను బయట నిలబెట్టడమో, కింద కూర్చోబెట్టడమో చేస్తుంది. అందుకే టెన్షన్‌గా డ్రైవ్

మెడ విరిగిన తలలు

చేస్తున్నాడు నాన్న.

ఆ బస్సులు, బళ్ల హారన్స్ మధ్యలో కూడా జేబులో నుంచి బయటికి తీసేవరకూ పిచ్చెక్కిన రాక్షసిలా అరుస్తూనే ఉంది నాన్న సెల్‌ఫోన్. ఆ ఫోన్ తీసి చెవి దగ్గర పెట్టుకుని మాట్లాడుతూ డ్రైవ్ చేస్తున్నాడు. ఆయన మెడ పక్కకు వంగిపోయింది. ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించుకుంటూ పక్కనున్న బస్సులను దాటేసుకుంటూ పాములా మెలికలు తిరుగుతూ వెళుతుంది మా స్కూటీ. ఎదురుగా చూస్తున్న దృశ్యాన్ని చెవిలో దూరుతున్న మాటలు డామినేట్ చేస్తున్నాయో ఏమో! నోట్లో నుంచి మాటలకు బదులు పోట్లాట బయటకు వస్తుంది. ఆ అరుపులు, కేకల మధ్య హడావుడి ప్రయాణం మాది. విచిత్రం ఏమంటే మా నాన్నే కాదు... ఎదురుగా వస్తున్న ఆటో డ్రైవర్లు, బస్సు డ్రైవర్లు, నా పక్కన వెళుతున్న వాహనాల మీద ఉన్నవారి మెడలు కూడా వంగిపోయే ఉన్నాయి. నిద్రలో మెడ పట్టేయడం వల్లో ఏదో జబ్బు వల్లో కాదు.'సెల్ఫోన్' అనే పిచ్చి పురుగు చెవులను కరవడం వల్ల. ఇంతలో దబేల్ మంటూ పెద్ద శబ్దం. స్కూలు ఆటోను యూటర్న్ తీసుకుంటున్న టిప్పర్ లారీ గుద్దింది. నల్లని రోడ్డుపై లంచ్‌బాక్సులో ఉన్న అన్నం తెల్లని మెతుకులు వెదజల్లితే ఆ మెతుకులపై రక్తం కల్లాపి చల్లింది. అచేతనంగా పడి ఉన్న ఆ దేహాలను అటువైపు ఇటువైపు వంగిన మెడలు మాకేమీ తెలియదు అన్నట్టు దాటుతూ ఉన్నాయి. సాయం చేయడం ఎరుగని చేతులు వీడియోలు తీస్తున్నాయి. వంగిపోయిన మెడలు మాత్రమే చూస్తున్నాయి.

'నాన్న ఆగుదామా అన్నాను' . వద్దు స్కూల్‌కి టైం అయిపోతుంది అన్నాడు నాన్న. అంత హడావిడిగా వెళ్ళినా క్లాస్ రూమ్ లో నేను కిందే కూర్చున్నాను. తలవంచుకొని కింద కూర్చున్న నా కాళ్ళపై కన్నీళ్లు రాలుతూ ఉన్నాయి. అవమాన భారంతో కాదు. ర్యాంకుల రేస్‌తో పాటు ఉరుకుల పరుగుల బతుకులు మాకు ఇప్పటి నుంచే అలవాటు చేస్తున్నందుకు. ఒక్కింత నవ్వు కూడా వచ్చింది. టీచర్ కూడా లేని డిజిటల్ క్లాస్ రూమ్‌లో స్క్రీన్‌పై 'జీవ పరిణామ సిద్ధాంతం' లెసన్ జరుగుతూ ఉన్నందుకు. సాయంకాలం ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు చూశాను. ఆ యాక్సిడెంట్ జరిగిన చోట ఏమీ లేదు. కానీ మళ్ళీ మెడలు వంగిపోయిన తల్లులు ఎన్నో మాట్లాడుకుంటూ హడావుడిగా వెళుతూనే ఉన్నారు. ఇంటికి రాగానే మా ఇంట్లో గోడకు తగిలించి ఉన్న కారల్ మార్క్స్ ఫోటో కింద 'తల్లకిందులుగా ఉన్న ఈ సమాజాన్ని మళ్ళీ తన కాళ్లపై నిలబెడదాం రండి'"అన్న క్యాప్షన్ చూశాను. 'వంగిపోయిన మెడలపై ఉన్న తలను సరి చేద్దాం రండి' అని మరో వాక్యం రాయాలనిపించింది.



గోనె జాషువా,
10వ తరగతి, భాష్యం హైస్కూలు, చంద్రమౌళి నగర్, గుంటూరు,
75691 16080.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com


మా ప్రశ్నకు జవాబు చెప్పండి...



బుడి బుడి నడకల బుజ్జాయిలం.. స్వేచ్ఛగ ఎగిరే విహంగులం.. తర్కం తెలిసిన వాళ్లం.. ప్రతిదీ తెలియాలనుకుంటాం. ఈ ప్రపంచం అందరిదీ.. మాకూ పరిచయం చేయండి..

ప్రతి రోజూ ఉదయం మా వీధిలోకి కూరగాయలు, ఆకుకూరలు అమ్మేవాళ్లు వస్తారా.. అమ్మ రోజూ వాళ్ల దగ్గరే కూరగాయలు కొంటుంది. ఒక్కోసారి నాన్న మార్కెట్‌కు వెళ్లి చాలా కూరగాయలు తెస్తాడు. కొన్ని పచ్చగా, ఎర్రగా, తెల్లగా ఉంటాయి కదా! నాకైతే కొన్ని పేర్లు తెలుసు. తమ్ముడికి తెలియదు కదా! 'అమ్మా 'దీన్నేమంటారు? దాన్నేమంటారు?' అని అడుగుతూ వాడు అమ్మ చుట్టూ తిరుగుతాడు. ఒక్కోసారి చెబుతుంది. ఇంకోసారి విసుక్కుంటుంది. వాడేమో చిన్నమొఖం చేసుకుని ఇవతలకి వచ్చేస్తాడు. నాకైతే అమ్మ మీద భళే కోపం వస్తుంది. 'పెద్దయ్యాక మీకే తెలుస్తుందిలే' అంటూ చాలామంది అమ్మానాన్న పిల్లలు అడిగిన వాటికి సమాధానం చెప్పరెందుకో నాకిప్పటికీ అర్థం కాదు.


మొన్న దీపావళి జరిగింది కదా! మా చుట్టుపక్కల కొందరిళ్లల్లో లైట్లు పెట్టుకున్నారు. ఇంకొంతమంది మట్టితో తయారుచేసిన చిన్న చిన్న గిన్నెల్లో నూనె పోసి తెల్లదారం వేసి వెలిగించారు. నాకు వాటిని చూస్తే భళే ఆశ్చర్యమేసింది. అవేంటి నాన్నా.. అని అడిగా. వాటిని ప్రమిదలంటారు. అది తెల్లదారం కాదు, దూదితో తయారు చేసిన వొత్తి అని చెప్పాడు. నాన్న సమాధానంతో నా బుర్రలో మరో రెండు ప్రశ్నలు




పుట్టుకొచ్చాయి. వెంటనే.. 'నాన్న వీటిని ఎవరు తయారుచేస్తారు? వాళ్ళెక్కడ ఉంటారు?' అని అడిగా.. నాన్న చిరాకుగా ముఖం పెట్టి తిక్కతిక్క ప్రశ్నలు వేయకు. వాళ్లెక్కడో ఉంటారు. నోర్మూసుకుని ఇంటికి పద! అని ఇంటికి లాక్కొచ్చినంత పనిచేశాడు. నేనేమైనా తప్పుగా అడిగానా..?

ఓ రోజు అమ్మ తమ్ముడికి అన్నం పెట్టింది. తినడం పూర్తయ్యేసరికి పళ్లెం చుట్టూ కింద చాలా అన్నం పడింది. అది చూసి వాడిని తిడుతూ 'అన్నం అలా పారేయకూడదు. చాలా కష్టపడితే వచ్చింది' అని చెప్పింది. అప్పుడు నేను ఎవరు కష్టపడ్డారమ్మా.. అని అడిగా.. వెంటనే అమ్మ 'రైతులు నాన్న' అని చెప్పింది. నేను ఊరుకుంటానా.. 'నాన్న కొట్టుకు వెళ్లి బియ్యం తెస్తాడు. నువ్వు అన్నం వండుతావు. ఈ రైతులెవరు? మా పుస్తకాల్లో చూశాను. వాళ్లేనా..' అని అడిగా. 'వాళ్లే' అని చెప్పి వెళ్లిపోయింది. పుస్తకాల్లో నేను చూసిన రైతులకి మేం తినే అన్నానికి సంబంధం ఏంటో నాకర్థం కాలేదు. అమ్మని అడుగుదామంటే తిడుతుందేమోనని భయం. చెబితేనే కదా మాకు అన్నం విలువ, రైతు కష్టం తెలుస్తుంది!

మొన్న స్కూల్లో ఎవరో నీళ్ల పంపు తిప్పేసి వెళ్లిపోయారు. నేను వెళ్లే సరికి నీళ్లు పోతూ ఉన్నాయి. వెంటనే నేను పంపు కట్టేశాను. ఆ విషయం ఇంటికొచ్చి అమ్మకు చెబితే 'మంచి పని చేశావు. నీళ్లు వృధా చేయకూడదు. జాగ్రత్తగా వాడుకోవాలి' అని చెప్పింది. 'ఎందుకమ్మా.. మనకి ట్యాంకు నిండా నీళ్లు ఉన్నాయిగా. ఎప్పుడు పడితే అప్పుడు వస్తాయిగా' అని అడిగా. 'చెప్పింది విను. తిక్కతిక్క ప్రశ్నలతో నా మెదడు తినకు' అని చెప్పేసి తన పనిలోకి వెళ్లిపోయింది. మొన్నోసారి మా క్లాసులో 'నీరు–ఆవశ్యకత' పాఠం చెప్పారు. నీరు ప్రాణాధారమని, వృథా చేయకూడదని కంఠస్థం చేయించారు. మన దగ్గర చాలా నీళ్లు ఉన్నాయిగా టీచర్.. ఎందుకు జాగ్రత్తగా వాడుకోవాలి' అని అడిగా.. 'చెప్పిన పాఠం విను. మధ్యలో ప్రశ్నలడిగి విసిగించకు' అని టీచరు విసుక్కున్నారు.



కొట్టుకు వెళ్లి డబ్బులివ్వకపోతే చాక్లెట్లు, బిస్కెట్లు ఇవ్వరు. డబ్బులిస్తేనే ఏ వస్తువైనా కొనుక్కోగలమని మాకెలా తెలుస్తుంది? కూరగాయలమ్మేవాళ్లు, చేపలమ్మేవాళ్లు, పండ్లు అమ్మేవాళ్లుఎంతోమంది తోపుడు బండ్ల మీదో, తలమీద బుట్ట పెట్టుకునో రోజూ మాకు కనబడుతూనే ఉంటారు. వాళ్లు అవి ఎందుకు అమ్ముకుంటారో.. అవి ఎక్కడ నుంచి వస్తున్నాయో మాకు తెలియదు గదా! మొక్కలు, జంతువులు, పక్షులు, నదులు, కాల్వలు, వంతెనలు, డ్రైవర్లు,



కండక్టర్లు, వ్యాపారులు, కూలీలు, వస్తువులు ఇలా ఎన్నో మా చుట్టూ ఉంటాయి. వాటన్నింటినీ, వాళ్ల గురించి తెలుసుకోవాలని మాకు చాలా ఉత్సాహంగా వుంటుంది. కానీ మీ పెద్దవాళ్లు ఎప్పుడూ అవన్నీ మాకు అర్థంకాని విషయాలని కొట్టిపారేస్తారు. మాకు అర్థమయ్యేలా చెప్పాలని ఆలోచించరు.


మా చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించడమే మా పని. వాటి గురించి తెలుసుకోవాలని ఉబలాటపడడం మా నైజం. స్కూల్లో చెప్పే పాఠాల్లో.. బొమ్మల్లో చెప్పే కథల్లో మేం ఊహించుకునే వ్యక్తులు, వస్తువుల గురించి, ప్రాంతాల గురించి మాకూ పరిచయం చేయండి. వాటి విలువ, వారి కష్టం తెలిస్తేనే కదా.. వాళ్లపై అభిమానం, గౌరవం కలుగుతాయి. మా పిల్లలందరి తరపున పెద్దలందరికీ ఇదే నా విన్నపం. ఈ ప్రపంచంలో మేమూ ఉన్నాం. చిన్న చిన్న విషయాలనైనా పిల్లలకు అర్థమయ్యేలా చెప్పండి. అమాయకంగా మేమడిగే ప్రశ్నలకు విసుక్కోకుండా సమాధానం ఇవ్వండి. పిల్లలమైనా పరిశీలించడం.. పరిశోధించడంలో పెద్దలకేం తీసిపోం.. అందుకే ఓ పెద్దల్లారా మా ప్రశ్నలకు సమాధానం చెప్పండి.

- జ్యోతిర్మయి

'వాల్తేరు వీరయ్య'లో ఊర్వశి రౌటెలా




మెగాస్టార్ చిరంజీవి 'వాల్తేరు వీరయ్య' చిత్రంలో నటిస్తున్నారు. చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. చాలాకాలం తర్వాత చిరంజీవి ఊర మాస్ పాత్ర పోషిస్తుండగా.. మాస్ మహరాజ్ రవితేజ సైతం కీలకపాత్ర పోషిస్తున్నాడు. బాబీ దర్శకత్వంలో చిత్రం తెరకెక్కుతున్నది. ఇప్పటికే సినిమాకు సంబంధించిన పోస్టర్లు, టైటిల్ టీజర్ విడుదలయ్యాయి. చిత్రంలో శృతి హాసన్ హీరోయిన్ నటిస్తుండగా.. బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌటెలా స్పెషల్ సాంగ్‌లో మెగాస్టార్‌తో స్టెప్పులు వేయనున్నది. ఈ మేరకు చిరంజీవితో ఉన్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. 'నేను అవార్డులు గెలుచుకున్నప్పుడు నా తల్లిదండ్రుల గురించి ఆలోచిస్తాను. నాకు అత్యుత్తమంగా ఉండడం అంటే నన్ను నేను ఈ విశ్వంలో నిరూపించుకోవడం' అని ఫొటోకు కామెంట్‌ను జత చేసింది. ఈ సందర్భంగా అవకాశం కల్పించిన మెగాస్టార్, దర్శకుడు బాబీ, మైత్రీ మూవీమేకర్స్‌కు ధన్యవాదాలు తెలిపింది.



అత్యున్నత స్థాయిలో పుష్ప-2 ప్రచారం

అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన పుష్ప చిత్రం ఘనవిజయం సాధించింది. ఈ నేపథ్యంలో త్వరలో విడుదలకు సిద్ధంగా ఉన్న రెండవ భాగాన్ని అత్యున్నత సాంకేతిక ప్రమాణలతో తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో పుష్ప–2కి సంబంధించిన చిన్న వీడియో గ్లింప్స్‌ని విడుదల చేసేందుకు చిత్రబృందం సమాయత్తమవుతోంది. దీనికి సంబంధించిన చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే అర్జున్‌పై కొన్ని కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. డిసెంబర్ 16న అవతార్–2 రిలీజ్ అవుతోన్న సందర్భంగా అదే రోజున పుష్ప– గ్లింప్స్ కూడా రిలీజ్ చేయాలని టీమ్ భావించినట్లు సమాచారం. ఈ ప్రచార చిత్రాన్ని అవతార్–2 తరహాలోనే వివిధ అంతర్జాతీయ భాషల్లో రిలీజ్ చేయాలని భావిస్తున్నారు. ఇదే వేదికగా సినిమా రిలీజ్ తేదిని కూడా ప్రకటించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రతి నిమిషం కష్టపడ్డా ..



గోల్కొండ హైస్కూల్ సినిమాతో ఇండస్ట్రీకి పరిచయం అయిన సంతోష్ శోభన్ వరుస సినిమాల్లో నటిస్తూ హీరోగా మంచి పేరు దక్కించుకుంటున్నారు. తాజాగా 'లైక్ షేర్ అండ్ సబ్స్క్రైబ్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద పెద్దగా విజయం సాధించకున్నా శోభన్ నటనకు మంచి మార్కులే పడ్డాయి. తాజాగా సోషల్ మీడియాలో ఇండస్ట్రీలో తన ప్రయాణం గురించి శోభన్ ఎమోషనల్ ట్వీట్ చేశారు.

'నా మొదటి సినిమా మొదలుకుని ఇప్పటి వరకు ఎంతోమంది ప్రోత్సాహం నాకు దక్కింది. మొదటిసారి కెమెరాను ఎదుర్కొన్న సమయంలో ఎంతో భావోద్వేగానికి గురయ్యాను. నటన పట్ల ఉన్న ఆసక్తితో ప్రతి నిమిషం ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేసేందుకు కష్టపడ్డాను. ప్రతి నిమిషం నన్ను నేను మార్చుకుంటూ సినిమాల్లో నటిస్తున్నాను. కొన్ని సందర్భాల్లో ప్రేక్షకులను అలరించేందుకు కష్టపడ్డా ఫలితం దక్కదు. అయినా నిరుత్సాహ పడకుండా మళ్లీ మళ్లీ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసేందుకు సినిమాలు చేస్తాను' అంటూ శోభన్ చేసిన ట్వీట్ బాగా వైరల్ అవుతోంది.



త్వరలో 'వలిమై' ఫస్ట్ సింగిల్

అజిత్ హీరోగా హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'వలిమై'. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నట్లు ఇటీవలే చిత్రబృందం తెలిపింది. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో మేకర్స్ వరుసగా అప్‌డేట్స్ ఇస్తున్నారు. ఈ మూవీ ఫస్ట్ సింగిల్ వచ్చే వారంలో విడుదల చేస్తున్నట్లు సమాచారం. అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని జీ–స్టూడియోస్‌తో కలిసి బోనీకపూర్ సంయుక్తంగా నిర్మిస్తున్నాడు. ఇటీవలే అజిత్ డబ్బింగ్ పనులను పూర్తి చేసుకున్న ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతం అందిస్తున్నాడు.

'చెడ్డి గ్యాంగ్...' టీజర్ విడుదల

'సినిమాల్లో చిన్న, పెద్ద తేడా ఉండదు. కంటెంట్ బాగుంటే ప్రతి సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తారు' అంటున్నారు దర్శకుడు నాగ్ అశ్విన్. అబుజా ఎంటర్‌టైన్‌మెంట్, శ్రీలీల ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై వెంకట్ కళ్యాణ్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'చెడ్డి గ్యాంగ్ తమాషా'. గాయత్రి పటేల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర టీజర్‌ని నాగ్ అశ్విన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా 'నటుడు అవ్వాలనే మా అమ్మ కోరికతో ఇండస్ట్రీకి వచ్చాను. ఈ సినిమాతో నా 15 ఏళ్ల కల నెరవేరింది. అన్ని వర్గాల వారిని ఆకర్షించేలా ఈ చిత్రం ఉంటుంది' అని దర్శకుడు, హీరో వెంకట్ కళ్యాణ్ అన్నారు.

కప్ నీదా.. నాదా..!

పాకిస్తాన్ X ఇంగ్లండ్ అమీ తుమీ
నేడు టి20 ప్రపంచకప్ ఫైనల్
మధ్యాహ్నం 1.30గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



మెల్‌బోర్న్: టి20 ప్రపంచకప్ ముగింపు దశకు చేరకుంది. ఆదివారం జరిగే ఫైనల్లో పాకిస్తాన్ జట్టు పటిష్ట ఇంగ్లండ్‌తో టైటిల్‌కై తలపడనుంది. అక్టోబర్ 16న నమీబియా–శ్రీలంక జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌తో ఈ మెగా సంగ్రామం ప్రారంభం కాగా.. నవంబర్ 12న జరిగే ఫైనల్‌తో 2022 ప్రపంచకప్ టోర్నీ ముగియనుంది. 2సార్లు టైటిల్ విజేత వెస్టిండీస్ జట్టు ప్రధాన టోర్నీకి అర్హత సాధించలేకపోయింది. ఇక సూపర్–12 గ్రూప్–ఏలో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు సెమీస్‌కు చేరడంలో విఫలమైంది. గ్రూప్–బిలో అయితే దక్షిణాఫ్రికా జట్టు నెదర్లాండ్స్ చేతిలో ఓడి సెమీస్‌కు దూరం కాగా.. ఇండియా, జింబాబ్వేలపై ఓడి సెమీస్‌పై ఆశలు వదులుకున్న పాకిస్తాన్ జట్టు ఏకంగా ఫైనల్లోకి దూసుకొచ్చింది. సెమీస్‌లో అంచనాలను తలక్రిందులు చేస్తూ.. కివీస్ జట్టును పాకిస్తాన్ ఓడిస్తే.. భారత్‌పై 10 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ ఘన విజయం సాధించింది. టి20 ప్రపంచకప్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంచలనాలు నమోదైన ఈ ఏడాది టి20 ప్రపంచకప్ టైటిల్ ఏ జట్టుకు వరించనుంది. ఇరుజట్లు ఒక్కోసారి టైటిల్‌ను గెలుచుకున్నాయి.

ఇరుజట్లు ఇప్పటివరకు 28 టి20 మ్యాచుల్లో తలపడగా.. 18మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్, 9మ్యాచ్‌ల్లో పాకిస్తాన్ విజయం సాధించాయి. ఒక దాంట్లో ఫలితం తేలలేదు. చివరి ఐదు మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ మూడుసార్లు విజయం సాధించగా.. పాక్ రెండింటిలో గెలుపొందింది. ప్రపంచకప్‌కు ముందు జరిగిన టి20లో ఇంగ్లండ్ నిర్దేశించిన 200పరుగుల లక్ష్యాన్ని పాక్ వికెట్ కోల్పోకుండా ఛేదించడం విశేషం. టి20 ప్రపంచకప్‌లలో ఇరుజట్లు రెండుసార్లు (2009, 2010) తలపడగా.. ఆ రెండు మ్యాచ్‌ల్లోనూ ఇంగ్లండ్ విజయం సాధించడం విశేషం. ఇప్పటివరకు 7 టి20 ప్రపంచకప్ టోర్నీలో జరగ్గా.. పాక్ జట్టు ఫైనల్‌కు చేరడం ఇది మూడోసారి. 2007లో భారత్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలవగా.. 2009ఫైనల్‌లో శ్రీలంకను మట్టికరిపించి టైటిల్‌ని ఎగరేసుకుపోయింది. మరో మూడుసార్లు 2010, 2012, 2021లో సెమీస్‌లోనే వెనుదిరిగింది. ఇక ఇంగ్లండ్ జట్టు కూడా ఫైనల్ చేరుకోవడం ఇది మూడోసారి. 2010లో ఆస్ట్రేలియాని ఓడించి విశ్వవిజేతగా నిలవగా.. 2016 ఫైనల్‌లో వెస్టిండీస్ చేతిలో ఓటమిపాలై రన్నరప్‌గా నిలిచింది. 2021లో సెమీస్‌లో వెనుదిరిగింది.

జట్లు..

పాకిస్తాన్: బాబర్(కెప్టెన్), రిజ్వాన్(వికెట్ కీపర్), హ్యారీస్, షాన్ మసూద్, ఇఫ్తికార్ అహ్మద్, షాదాబ్ ఖాన్, నవాజ్, వాసీం జూనియర్, నసీమ్ షా, హ్యారీస్ రవూఫ్, షాహీన్ షా అఫ్రిది, ఖుష్‌దిల్ షా, హస్నైన్, హైదర్ అలీ, ఆసిఫ్ అలీ.

ఇంగ్లండ్: బట్లర్(కెప్టెన్, వికెట్ కీపర్), హేల్స్, ఫిలిప్ సాల్ట్, స్టోక్స్, బ్రూక్, లివింగ్‌స్టోన్, మొయిన్ అలీ, సామ్ కర్రన్, క్రిస్ వోక్స్, జోర్డాన్, ఆదిల్ రషీద్, డేవిడ్ విల్లీ, మిల్స్, మార్క్ వుడ్, డేవిడ్ మలన్.

హోరాహోరీగా రెవెన్యూ క్రీడలు

ప్రజాశక్తి – ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)



ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా 6వ రాష్ట్ర రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు–2022 శనివారం రెండవ రోజూ ఉత్సాహపూరిత వాతావరణంలో కొనసాగాయి. రెవెన్యూ శాఖలోని గ్రామ రెవెన్యూ సహాయకుని స్థాయి నుండి డిప్యూటీ కలెక్టరు స్థాయి వరకు రాష్ట్ర వ్యాప్తంగా హాజరైన ఉద్యోగులు సాంస్కృత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తి పాటలు, సినీ గేయాలను పాడుతూ, వివిధ పౌరాణిక వేషధారణలో స్కిట్స్ వేస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు. చెస్ మహిళా విభాగంలో సందిపోగు సాలోమి (కర్నూలు) ప్రథమ, ఎస్.కె కరీమున్నీసా (నెల్లూరు) ద్వితీయ, టి.త్రిలోక (గుంటూరు) తృతీయ, రాహిత్యాదేవి (శ్రీకాకుళం) నాలుగో స్థానం సాధించారు. పురుషుల విభాగంలో చలపతిరావు (శ్రీకాకుళం) ప్రథమ, ఎమ్మెస్ రాయుడు (ఈస్ట్ గోదావరి) ద్వితీయ, పి శ్రీనివాసరెడ్డి (కర్నూలు) తృతీయ, జె అంతోనిబాబు (నెల్లూరు) నాలుగో స్థానంలో నిలిచారు. వాలీబాల్ పురుషుల విభాగంలో క్వార్టర్ ఫైనల్స్‌లో కృష్ణా, నెల్లూరు జిల్లా మధ్య జరిగిన పోరులో కృష్ణ జట్టు 2–0 తేడాతో నెల్లూరు జట్టు మీద విజేతగా నిలిచింది. తూర్పు గోదావరి, ప్రకాశం జిల్లాల మధ్య జరిగిన పోటీలో తూర్పు గోదావరి జట్టు ప్రకాశం జట్టుపై 2–0 తేడాతో గెలుపొందింది. విజయనగరం, వైఎస్ఆర్ కడప జట్ల మధ్య జరిగిన పోరులో విజయనగరం జట్టు 2–0 తేడాతో, శ్రీకాకుళం, కర్నూలు జట్లకు మధ్య జరిగిన పోరులో కర్నూలు జట్టు 2–0 తేడాతో విజయం సాధించాయి. కబడ్డీ పురుషులు విభాగంలో కర్నూలు జట్టు, పశ్చిమ గోదావరి జట్టుపై 23–21 తేడాతో గెలుపొందింది. నెల్లూరు, విజయనగరం జట్లు తలపడగా నెల్లూరు జట్టు 40–27 తేడాతో విజేతగా నిలిచింది.

నేడు విజేతలకు బహుమతుల ప్రదానం

నేడు జరిగేముగింపు సభకు మంత్రి ధర్మాన ప్రసాదరావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి విజేత లకు బహుమతులు ప్రదానం చేస్తారని నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక అతిథిగా అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్ హాజరు కానున్నారు.

హ్యాండ్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి – బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 51వ ఎపి సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్స్ హ్యాండ్‌బాల్ ఛాంపియన్ షిప్ 2022–23 పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు రెండురోజులపాటు జరగనున్నాయి. 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలను కలెక్టర్ విజయకృష్ణన్ ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో జరిగే అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీలకు సూచికగా జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్‌డిఒ జి.రవీందర్, హ్యాండ్ బాల్ నిర్వహణ కన్వీనర్ బొడ్డు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర-గోవా మ్యాచ్ రద్దు

బెంగళూరు: విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో భాగంగా శనివారం జరిగిన ఆంధ్రప్రదేశ్–గోవా జట్ల రద్దు కాగా.. ఎలైట్ గ్రూప్–ఏలో హైదరాబాద్ జట్టు 18 పరుగుల తేడాతో హిమాచల్ ప్రదేశ్‌పై విజయం సాధించింది. హైదరాబాద్ 50 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 360పరుగులు చేస్తే.. హిమాచల్ ప్రదేశ్ 48ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 335పరుగులే చేయగల్గింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68